www.udyamakeratam.com

PRGI No. : TGTEL/25/A0273

1 వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 108 | 6-10-2026 | మంగళవారం | పేజీలు: 8 | వెల : రూ.2/-

# మెగా రోడ్లకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వండి!



తెలంగాణలో రహదారుల మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. గుజరాత్‌లోని ఏక్తానగర్ (స్టాచ్యూ ఆఫ్ యూనిటీ) ప్రాంగణంలో జరుగుతున్న 'చింతన్ శివిర్-2026' కార్యక్రమంలో భాగంగా కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సోమవారం ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పలు కీలక రహదారి ప్రాజెక్టులు, అనుమతులు, నిధుల మంజూరుపై ఇరువురూ సుదీర్ఘంగా చర్చించారు.

- కీలక ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి
- ఎల్‌బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ మంజూరు చేయాలి
- కేంద్ర మంత్రి గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి భేటీ

2



## కాంతితో మెదడుకు కళ్లెం

# వైద్య విభాగంలో ముగ్గురికి నోబెల్

ఆప్టోజెనెటిక్స్‌లో విప్లవాత్మక పరిశోధనలకు అత్యున్నత పురస్కారం

3

కార్ల్ డైసెరోత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాగెల్‌కు సంయుక్తంగా అవార్డు

# బకాయిల సుడిగుండంలో తెలంగాణ!



## కాంట్రాక్టర్లు, ఉద్యోగుల చెల్లింపులే రూ.65 వేల కోట్లకు పైగా

- కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులు, ఇతర బిల్లులు రూ.51 వేల కోట్లకు చేరినట్లు కథనాలు
- ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిలు రూ.14 వేల కోట్లకు పైమాటే
- జీతాలు, పెన్షన్లు, అప్పుల చెల్లింపులతో ఖజానాపై పెరుగుతున్న ఒత్తిడి
- సంక్షేమం.. అభివృద్ధి.. బకాయిల మధ్య సమతుల్యమే రేవంత్ సర్కారుకు సవాల్

**హైదరాబాద్, అక్టోబర్ 5 (ఉద్యమ కెరటం):** ఒకవైపు సంక్షేమ పథకాలు.. మరోవైపు అభివృద్ధి పనులు.. ఇంకోవైపు జీతాలు, పెన్షన్లు, అప్పుల చెల్లింపులు. వీటన్నింటి మధ్య పేరుకుపోతున్న పెండింగ్ బిల్లులు తెలంగాణ ప్రభుత్వానికి పెద్ద ఆర్థిక సవాల్‌గా మారుతున్నాయి. తాజా కథనాల ప్రకారం కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులు తదితర చెల్లింపులకు సంబంధించిన బకాయిలు రూ.51 వేల కోట్లకు పైగా ఉండగా, ఉద్యోగులు, పదవీ

మిగతా 2 లో



# ఏడాదిన్నరలో భూ లెక్క తేలాలి!

ప్రతి భూ కమతానికి ప్రత్యేక ఎల్‌పీఎం నంబర్

## ప్రతి గ్రామంలో సమగ్ర భూసర్వే పూర్తికి కార్యాచరణ

- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం: మంత్రి పొంగులేటి
- అటవీ భూముల సమస్యతో ఇందిరమ్మ ఇళ్లు ఆగొద్దని ఆదేశం
- అవసరమైతే రాష్ట్రస్థాయి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తామని వెల్లడి

రాష్ట్రంలో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చేపట్టిన సమగ్ర భూసర్వే ప్రక్రియను వచ్చే ఏడాదిన్నరలోగా ప్రతీ రెవెన్యూ గ్రామంలో పూర్తి చేసేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నామని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, అధికారులతో రెవెన్యూ, గృహనిర్మాణ శాఖలపై ఆయన సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు.

.. వివరాలు 2లో

# నేరస్తుల గుండెల్లో భయం పుట్టాలి

- అత్యాచార ఘటనలపై సుప్రీంకోర్టు సీరియస్
- ఢిల్లీ పోలీసులకు కీలక ఆదేశాలు!

4





## నిత్యావసర ధరలపై నియంత్రణ ఏదీ?

ఆకాశాన్ని అంటుతున్న సన్న బియ్యం

రేవంత్ సర్కార్ నేల చూపులు

హరీష్‌రావు

3

## రెండు నెలలే గడువు.. లేదంటే ఆమరణ దీక్ష!

- సింగరేణి యాజమాన్యానికి కవిత అల్టిమేటం
- హెచ్ఎంఎస్, తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో సింగరేణి భవన్ ముట్టడి
- మెడికల్ బోర్డు, డిపెండెంట్ ఉద్యోగాలపై తేల్చాలని డిమాండ్
- లాభాల్లో 35 శాతం కార్మికులకు ఇవ్వాలన్న కవిత
- రోడ్డుపై బైఠాయింపు.. అధికారులతో చర్చలు

3



మైనింగ్‌తో రామప్పకు ముప్పు అవాస్తవం

## చట్టవిరుద్ధంగా ఫామ్-6 మార్పులు

- సుప్రీం వ్యాఖ్యలతో సీఈసీపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు
- 'జ్ఞానేశ్‌కుమార్ చట్టవిరుద్ధంగా.. ఏకపక్షంగా మార్చారు' అంటూ విమర్శ
- 'బీజేపీకి మేలు చేసేందుకే అధికార దుర్వినియోగం' అని ఆరోపణ

4






## ఆ రికార్డులను సమర్పించండి

ఈసీ నిర్ణయాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశం

వివరాలు 4లో

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
మంగళవారం
6 అక్టోబర్ 2026



# గురుకులంలో మళ్లీ ఎలుకల కలకలం

## ఐదో తరగతి విద్యార్థినికి గాయాలు!

**గూడూరు, అక్టోబర్ 5 (ఉద్యమ కెరటం):** స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో మళ్లీ ఎలుకల కలకలం రేగింది. రాత్రి వేళ నిద్రిస్తున్న ఐదో తరగతి విద్యార్థినిపై ఎలుకలు దాడి చేసి కొరకడంతో ఆమె కాలు కింది భాగంలో తీవ్ర గాయమైంది. ఈ ఘటనతో పాఠశాల విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న తహసిల్దార్ నాగభవాని తక్షణమే గురుకుల పాఠశాలకు చేరుకుని బాధితురాలితో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం సదరు విద్యార్థినిని తగిన వైద్య పరీక్షలు, చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. నెల రోజుల క్రితం కూడా ఇదే పాఠశాలలో మరో విద్యార్థినిని ఎలుకలు కొరికి గాయపరిచాయని విద్యార్థినులు ఈ సందర్భంగా తహసిల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. పదేపదే ఇటువంటి సంఘటనలు పునరావృతమవుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# వైఐఐఆర్ఎస్ పనులు వేగవంతం కావాలి

## విదేశీ వర్సిటీ క్యాంపస్‌ల ఏర్పాటుకు ప్రత్యేక విధానం

## సీఎస్ సంజయ్ జాజు సమీక్ష



**హైదరాబాద్, అక్టోబర్ 5 (ఉద్యమ కెరటం) :** రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల(వైఐఐఆర్ఎస్)ను దశలవారీగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం, విద్యా మౌలిక వసతుల అభివృద్ధి, ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ స్థాయి ఉన్నత విద్యా సంస్థల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై సచివాలయంలో సీనియర్ అధికారులతో ఆయన సోమవారం సమీక్ష నిర్వహించారు. డిసెంబర్ 2027 నాటికి 67 పాఠశాలలను పూర్తి చేయడంతో పాటు జూన్ 2028 నాటికి ఈ సంఖ్యను 87కు పెంచేలా పనులను వేగవంతం చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి పాఠశాలను సుమారు 26 ఎకరాల విస్తీర్ణంలో అన్ని ఆధునిక సదుపాయాలతో నిర్మించేలా ప్రణాళిక రూపొందించారన్నారు. అవసరమైన క్రీడా మైదానాలు, వసతి గృహాలు, సిబ్బంది క్వార్టర్లు, ఆధునిక వంటశాలలు, డిజిటల్ తరగతి గదులు తదితర మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్దేశిత గడువుల్లో నాణ్యతా ప్రమాణాలతో పనులను పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. ఈ స్కూళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ పాఠశాలలు ఒకే క్యాంపస్‌లో ఉండే విధంగా నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. దేశంలో ఆదర్శవంతంగా ఉండే విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నారన్నారు.

### ఫ్యూచర్ సిటీలో విదేశీ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు

రాష్ట్రాన్ని అంతర్జాతీయ విద్యా కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సీఎస్ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. లండన్ యూనివర్సిటీ వంటి ప్రముఖ అంతర్జాతీయ విద్యా సంస్థలను తెలంగాణకు ఆకర్షించేలా సమగ్ర విధానాన్ని రూపొందించాలని సూచించారు. ఇప్పటివరకు లండన్ విశ్వవిద్యాలయం, బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయంతోపాటు మరో నాలుగు యూనివర్సిటీలు ఫ్యూచర్ సిటీలో తమ బ్రాంచీలు ఏర్పాటు చేసేందుకు సుముఖత వ్యక్తం చేశాయని అధికారులు పేర్కొన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాలను ఆహ్వానించడం, క్యాంపస్‌ల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు, పెట్టుబడులు, అనుమతులు, విద్యా కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలను ఈ విధానంలో పొందుపరచాలన్నారు. రాష్ట్రంలో ప్రపంచస్థాయి విద్యావకాశాలను అందుబాటులోకి తేవడంతోపాటు విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాల విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సీఎస్ పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీలో ప్రతిపాదిత అంతర్జాతీయ విద్యా సంస్థల ఏర్పాటుకు సంబంధించి ప్రముఖ విదేశీ విశ్వవిద్యాలయాలతో సంప్రదింపులు జరిపి గ్లోబల్ సమ్మిట్ సమయానికి స్పష్టమైన కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేశ్ రంజన్, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానియా, యోగితా రాణా, రాహుల్ బొజ్జ, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

# బకాయిల సుడిగుండంలో తెలంగాణ!

మొదటి పేజీ తరువాయి

విరమణ చేసిన సిబ్బందికి చెల్లించాల్సిన బకాయిలను ఉద్యోగ సంఘాలు రూ.14,200 కోట్లకు పైగా అంచనా వేస్తున్నాయి. ఈ రెండు విభాగాలను కలిపితే రూ.65 వేల కోట్లకు పైగా చెల్లింపుల భారం కనిపిస్తోంది. అయితే ఇవన్నీ ఒకే ప్రభుత్వ అధికారిక సమగ్ర బకాయిల పట్టికలోని సంఖ్యలు కావని గమనించాలి. 2023 డిసెంబర్‌లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలో అప్పటికే ఉద్యోగులు, మూలధన పనులు, పథకాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు రూ.40,154 కోట్లుగా పేర్కొన్నట్లు తాజా నివేదికలు గుర్తుచేస్తున్నాయి. ఆ తర్వాత పాత బిల్లుల్లో కొంత చెల్లించినప్పటికీ కొత్త బిల్లులు చేరుతుండటంతో మొత్తం భారం తగ్గడం లేదనే పరిస్థితి నెలకొంది. తాజా కథనాల ప్రకారం కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులు తదితరులకు సంబంధించిన చెల్లింపులు రూ.51 వేల కోట్లకు పైగా ఉన్నట్లు పేర్కొంటున్నారు. రోడ్లు, నీటిపారుదల, ఇతర మౌలిక వసతుల పనులు చేసిన కాంట్రాక్టర్లకు చెల్లింపులు ఆలస్యం కావడం సమస్యగా మారింది. గత జూన్‌లోనూ పెండింగ్ బిల్లుల విడుదల కోసం కాంట్రాక్టర్లు ఆందోళనకు సిద్ధం కాగా, ప్రభుత్వం దశలవారీగా చెల్లింపులు చేస్తామని హామీ ఇచ్చింది.

### ఉద్యోగుల ఎదురుచూపులు

ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిల సమస్య కూడా ఖజానాపై ఒత్తిడిని పెంచుతోంది. ఉద్యోగ సంఘాల లెక్కల ప్రకారం 2026 ఆగస్టు నాటికి ఈ బకాయిలు రూ.14,200 కోట్లకు పైగా ఉన్నాయి. ఇందులో విధుల్లో ఉన్న ఉద్యోగులకు డీఏ, సరెండర్ లీవ్ తదితర బకాయిలు సుమారు రూ.6,200 కోట్లు కాగా, పదవీ విరమణ చేసిన వారికి జీపీఎఫ్, ఇతర రిటైర్మెంట్ ప్రయోజనాలు కలిపి సుమారు రూ.8 వేల కోట్లుగా పేర్కొంటున్నారు. ఈ ఏడాది దాదాపు 9 వేల మంది పదవీ విరమణ చేయడంతో కొత్తగా చెల్లించాల్సిన ప్రయోజనాల భారం కూడా పెరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. ప్రభుత్వం మాత్రం బకాయిలను విడతలవారీగా చెల్లించే ప్రయత్నం చేస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిల కోసం రూ.1,000 కోట్లు విడుదల చేసినట్లు అప్పట్లో ప్రభుత్వం తెలిపింది. అంతకుముందు ఉద్యోగులకు సంబంధించిన బకాయిల్లో రూ.4,575 కోట్లు చెల్లించినట్లు కూడా ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

### జీతాలు.. పెన్షన్ల భారం

రాష్ట్ర ఖజానాపై స్థిర వ్యయాల ఒత్తిడి కూడా పెరుగుతోంది. 2026–27 బడ్జెట్‌లో పెన్షన్లకు రూ.14,737 కోట్లు కేటాయించగా, వడ్డీ చెల్లింపులకు రూ.21,304 కోట్ల అంచనా ఉంది. జీతాలు, పెన్షన్లు, వడ్డీ వంటి తప్పనిసరి చెల్లింపులు పెరిగితే అభివృద్ధి, మూలధన వ్యయానికి అందుబాటులో ఉండే ఆర్థిక వెసులుబాటు సహజంగానే తగ్గుతుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఏడాది జనవరిలోనే ఉద్యోగుల ప్రయోజనాలకు రూ.11 వేల కోట్లు, కాంట్రాక్టర్లకు రూ.40 వేల కోట్ల బకాయిలతోపాటు సింగరేణి, విద్యుత్ సంస్థలకు చెల్లింపులు ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం బకాయిలు రూ.1.11 లక్షల కోట్లుగా ఉన్నాయని ఆయన అప్పట్లో వెల్లడించారు. అందువల్ల ప్రస్తుతం ప్రచారంలో ఉన్న రూ.65 వేల కోట్ల సంఖ్యను రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న మొత్తం బకాయిలుగా కాకుండా ప్రధానంగా కాంట్రాక్టర్లు, ఉద్యోగులు–పెన్షనర్లకు సంబంధించిన తాజా పెండింగ్ చెల్లింపుల అంచనాగా చూడాల్సి ఉంటుంది.



### బయటపడేదెలా..?

బకాయిలను ఒకేసారి చెల్లించడం కంటే చిన్న కాంట్రాక్టర్లు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వైద్య రీయింబర్స్‌మెంట్లు వంటి అత్యవసర చెల్లింపులకు ప్రాధాన్యం ఇస్తూ దశలవారీ పరిష్కారమే ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న మార్గంగా కనిపిస్తోంది. అదే సమయంలో ఆదాయ వనరులను పెంచడం, అనవసర వ్యయాన్ని నియంత్రించడం, కొత్త పనులకు అనుమతులు ఇచ్చే ముందు పాత బిల్లులకు నిధుల ప్రణాళిక రూపొందించడం కీలకం. లేకపోతే పాత బిల్లులు చెల్లించేలోపే కొత్త బకాయిలు పేరుకుపోయే చక్రం కొనసాగి అభివృద్ధి పనులపైనా ప్రభావం పడే ప్రమాదం ఉంది.

# మెగా రోడ్లకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వండి!

- కీలక ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి
- ఎల్‌బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ మంజూరు చేయాలి
- కేంద్ర మంత్రి గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి భేటీ
- ఎన్‌హెచ్ 65 6o2 లేన్ల విస్తరణ, ఆర్ఆర్ఆర్, హైదరాబాద్-అమరావతి ఎక్స్‌ప్రెస్‌వేపై చర్చ
- ఐదు రోప్‌వేలు.. మూడు ఆర్వోబీలు.. 33 రహదారి పనులకు నిధులు కోరిన మంత్రి
- హైదరాబాద్--శ్రీశైలం మార్గంలో ఎలివేటెడ్ కారిడార్‌కూ ప్రత్యేక విజ్ఞప్తి

**ఏక్తానగర్, అక్టోబర్ 5 (ఉద్యమ కెరటం):** తెలంగాణలో రహదారి మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరింత సహకారం అందించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. గుజరాత్‌లోని నర్మదా జిల్లా ఏక్తానగర్ స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో జరుగుతున్న 'చింతన్ శివిర్–2026' సందర్భంగా కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సోమవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణకు సంబంధించిన కీలక రహదారి ప్రాజెక్టులు, కేంద్ర అనుమతులు, నిధుల మంజూరు అంశాలపై చర్చించారు. చింతన్ శివిర్ అక్టోబర్ 5, 6 తేదీల్లో జరుగుతుండగా.. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం, కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులు ప్రధాన ఎజెండాగా ఉన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రహదారి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టిందని కోమటిరెడ్డి వివరించారు. తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ మధ్య కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడం, హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, పర్యాటక ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు.

### ఎల్‌బీనగర్-హయత్‌నగర్‌కు డబుల్ డెక్కర్

హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారంగా ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని గడ్కరీని కోరారు. ఎన్‌హెచ్–65పై ప్రతిపాదించిన ఈ కారిడార్‌ను మెట్రో విస్తరణతో సమన్వయం చేస్తూ 2026–27 వార్షిక ప్రణాళికలో చేర్చి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రభుత్వం కొంతకాలంగా కేంద్రం ముందుంచుతున్న కీలక ప్రతిపాదనల్లో ఒకటిగా ఉంది. ఎన్‌హెచ్–65లో ఎల్‌బీనగర్–మల్కాపూర్ సెక్షన్‌ను సర్వీస్ రోడ్లతో కలిపి ఆరు ప్రధాన లేన్లుగా విస్తరించే పనులను వేగవంతం చేయాలని కోరారు. హైదరాబాద్–విజయవాడ–మచిలీపట్నం మార్గంలో పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని విస్తరణకు సంబంధించిన తుది అనుమతులను త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

### ఐదు రోప్‌వేలకు రూ.1,230 కోట్లు

పర్వతమాల పథకం కింద రూ.1,230 కోట్ల అంచనాతో ఐదు రోప్‌వే ప్రాజెక్టులకు మంజూరు ఇవ్వాలని కోమటిరెడ్డి కోరారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం, నల్గొండ హనుమాన్ హిల్, నాగార్జునసాగర్–నాగార్జునకొండ, పెద్దపల్లి జిల్లా మంథని రామగిరి కోట, నిజామాబాద్ కిల్లా రామాలయం ప్రాంతాల్లో వీటిని ప్రతిపాదించినట్లు తెలిపారు. పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు కనెక్టివిటీ పెంచడంతోపాటు పర్యావరణహిత రవాణాకు ఇవి ఉపయోగపడతాయని వివరించారు. ఐదు రోప్‌వేల ప్రతిపాదన, రూ.1,230 కోట్ల అంచనాను తాజా నివేదికలు కూడా ధ్రువీకరిస్తున్నాయి. సేతు బంధన్ పథకం కింద కొత్తగూడెం బైపాస్, సుల్తానాబాద్, పగిడిపల్లి–నడికుడి రైల్వే సెక్షన్‌లలో మూడు కీలక ఆర్వోబీ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని కోరారు. మరోవైపు 2026–27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి కింద రాష్ట్రవ్యాప్తంగా 511.68 కిలోమీటర్ల మేర 33 రహదారి పనులకు రూ.1,227.75 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

### ఆర్ఆర్ఆర్‌కు త్వరగా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వండి

హైదరాబాద్ ప్రాంతీయ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి ఆర్థిక, కేంద్ర మంత్రివర్గ ఆమోదాలను త్వరగా పూర్తి చేయాలని మంత్రి కోరారు. సంగారెడ్డి–నర్సాపూర్–తూప్రాన్–గజ్వేల్–జగదేవ్‌పూర్–భువనగిరి–చౌటుప్పల్ మార్గంలో ప్రతిపాదించిన ఉత్తర భాగంతోపాటు దక్షిణ భాగాన్నీ కేంద్రం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ, పారిశ్రామిక పార్కులు, రేడియల్ రోడ్లకు దక్షిణ ఆర్ఆర్ఆర్ కీలకమని వివరించారు. ఆర్ఆర్ఆర్, ఎన్‌హెచ్–65 విస్తరణ, ఎల్‌బీనగర్ డబుల్ డెక్కర్ కారిడార్ అంశాలు చింతన్ శివిర్‌లో తెలంగాణ ప్రధాన ఎజెండాలో ఉన్నట్లు ముందస్తు అధికారిక కార్యక్రమ వివరాల్లోనూ వెల్లడైంది. హైదరాబాద్–అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే సమగ్ర ప్రాజెక్టు నివేదిక ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా కోమటిరెడ్డి కోరారు. తెలంగాణలోని డ్రైపోర్టుతో దీన్ని అనుసంధానిస్తే సరకు రవాణా, పారిశ్రామిక కార్యకలాపాలకు ఊతమిస్తుందని వివరించారు. హైదరాబాద్–శ్రీశైలం ఎన్‌హెచ్–765లో నల్లమల అటవీ ప్రాంతం మీదుగా ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతి ఇవ్వాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. మంత్రి వెంట రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, చీఫ్ ఇంజనీర్లు బి.వి.రావు, ధర్మారెడ్డి, వసంత్‌నాయక్‌తోపాటు పలువురు అధికారులు ఉన్నారు.



# ఏడాదిన్నరలో భూ లెక్క తేలాలి!

- ప్రతి గ్రామంలో సమగ్ర భూసర్వే పూర్తికి కార్యాచరణ
- ప్రతి భూ కమతానికి ప్రత్యేక ఎల్‌పీఎం నంబర్
- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- అటవీ భూముల సమస్యతో ఇందిరమ్మ ఇళ్లు ఆగొద్దని ఆదేశం
- అవసరమైతే రాష్ట్రస్థాయి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తామని వెల్లడి




**నిర్మల్, అక్టోబర్ 5 (ఉద్యమ కెరటం):** రాష్ట్రంలో ఏళ్ల తరబడి కొనసాగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూసర్వేను వచ్చే ఏడాదిన్నరలోగా ప్రతి గ్రామంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ప్రతి భూ కమతానికి ప్రత్యేక ల్యాండ్ పార్సెల్ మ్యాపింగ్ నంబర్ కేటాయించి, భూములకు సంబంధించిన సమగ్ర వివరాలను నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. భూ హక్కులకు భరోసా కల్పించడంతోపాటు భవిష్యత్తులో వివాదాలకు ఆస్కారం లేకుండా సర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా భూ రీసర్వేను ఏడాదిన్నరలో పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని మంత్రి గతంలోనూ ప్రకటించారు. నిర్మల్ కలెక్టరేట్‌లో సోమవారం ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో పొంగులేటి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో దశలవారీగా భూసర్వే చేపట్టి ఒక్కో భూ కమతానికి ఎల్‌పీఎం నంబర్ కేటాయించాలని మంత్రి ఆదేశించారు. భూమి విస్తీర్ణం, హక్కులు, ఇతర వివరాలను సమగ్రంగా నమోదు చేయడం ద్వారా భవిష్యత్తులో సరిహద్దు, యాజమాన్య వివాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొన్నారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సమస్యలు ఎక్కువగా ఉన్న గిరిజన ప్రాంతాల్లో రెండు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. అటవీ భూములకు సంబంధించిన సమస్యల కారణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోకుండా అధికారులు చొరవ తీసుకోవాలని పొంగులేటి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిష్కారం సాధ్యం కాని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే అటవీ, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలతో రాష్ట్రస్థాయిలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి పరిష్కార మార్గం చూపుతామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల్లో నివసిస్తున్న సుమారు 72 వేల నుంచి 73 వేల పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేలా ప్రణాళిక రూపొందించినట్లు మంత్రి తెలిపారు. తొలి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామని, రెండో దశలో మరో రెండు లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణానికి చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక స్తోమత లేని లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించి నిర్మాణాలు ముందుకు సాగేలా చూడాలని అధికారులకు సూచించారు. అర్హులైన పేదలకు విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని ప్రభుత్వం ఇటీవల కూడా ప్రకటించింది. సమావేశంలో చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్‌కుమార్, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, కుమురం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ హరిత, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, పవార్ రామారావు పటేల్, అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్‌బాబు, ఐటీడీఏ పీవో మంద మకరందుతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రెండు నెలలే గడువు.. లేదంటే ఆమరణ దీక్ష!

- సింగరేణి యాజమాన్యానికి కవిత అల్టిమేటం
- హెచ్ఎంఎస్, తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో సింగరేణి భవన్ ముట్టడి
- మెడికల్ బోర్డు, డిపెండెంట్ ఉద్యోగాలపై తేల్చాలని డిమాండ్
- లాభాల్లో 35 శాతం కార్మికులకు ఇవ్వాలన్న కవిత
- గంటకుపైగా రోడ్డుపై బైఠాయింపు.. అధికారులతో చర్చలు



**హైదరాబాద్, అక్టోబర్ 5 (ఉద్యమ కెరటం) :** రెండు నెలల్లోగా సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని తెలంగాణ రక్షణ సేన(టీఆరఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులను అన్‌ఫిట్ చేయడంతోపాటు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హెచ్ఎంఎస్, తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) నాయకులతో కలిసి సోమవారం లక్డీకాపూల్‌లోని సింగరేణి భవన్‌ను ముట్టడించారు. గంటకుపైగా రోడ్డుపై బైఠాయించారు. సింగరేణి యాజమాన్యం తమతో చర్చలు జరిపే వరకు అక్కడినుంచి కదిలేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ ఆందోళనతో సింగరేణి భవన్ ఎదుట పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. దీంతో సింగరేణి అధికారులు వచ్చి కవిత, హెచ్ఎంఎంఎస్ నాయకులతో చర్చలు జరిపారు. సింగరేణి సీ అండ్ ఎండీ సెక్రటేరియట్‌లో సమావేశంలో ఉన్నారని, ఆయన ఆదేశాల మేరకు తాము చర్చలకు వచ్చామని తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మెడికల్ బోర్డుకు అప్లయ్ చేసుకున్న వాళ్లందరినీ అన్‌ఫిట్ చేసి వాళ్ల వారసులకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. రెండు నెలల్లోగా ఈ ప్రక్రియ ప్రారంభం కావాలని, లేదంటే సింగరేణి భవన్ గేటు ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని ఆమె హెచ్చరించారు. కార్మికుల సంక్షేమాన్ని యాజమాన్యం పట్టించుకోవటం లేదని విమర్శిం చారు. మూడు నెలల క్రితం తాము ఒత్తిడి తెస్తేనే మెడికల్ బోర్డు పెట్టారని, కానీ దానికి దరఖాస్తు చేసుకున్న వారిలో 10 శాతం మందిని మాత్రమే అన్‌ఫిట్ చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత దరఖాస్తు చేసుకున్న వాళ్లందరినీ అన్‌ఫిట్ చేసి వాళ్ల వారసులకు ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. డిపెండెంట్ ఉద్యోగాలు మీరు వేసే బిచ్చం కాదు.. అది కార్మికుల హక్కు అని అన్నారు. సింగరేణి లాభాల్లో 35 శాతం కార్మికులకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలియాస్ పేర్లతో ఉద్యోగాలు చేస్తున్న వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా విజిలెన్స్ విచారణతో ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఇలా వేధింపులతో ఉద్యోగాల నుంచి తొలగించిన వాళ్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. తెలంగాణకు సింగరేణి ఆత్మవంటిదన్నారు. అలాంటి సింగరేణి కార్మికుల సంక్షేమానికి టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ పోరాటం చేస్తాయన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం రూ.60 వేల కోట్లు బకాయిలు పెట్టడంతోనే సంస్థ ఇబ్బందుల్లో ఉందన్నారు. వెంటనే ఆ బకాయిలు చెల్లించి సంస్థను కాపాడాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ ద్రోహుల చేతిలో బందీ అయ్యిందని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. స్వతంత్ర సంస్థగా ఉండాల్సిన సింగరేణిని మంత్రుల చేతిలో కీలుబొమ్మగా మార్చేశారన్నారు. ఇకనైనా యాజమాన్యం వైఖరిలో మార్పు రావాలని డిమాండ్ చేశారు. డిపెండెంట్ ఉద్యోగాలు సహా కార్మికుల సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు. కొత్త బొగ్గు బావులను ప్రైవేట్ సంస్థలకు కాకుండా సింగరేణి ద్వారా నిర్వహించాలని, నైనీ బ్లాక్‌లో కూడా సింగరేణి నుంచి కార్మికులను నియమించాలన్నారు.

# మెహదీపట్నంలో ఏసీబీ దాడి.. రూ.4 లక్షల లంచం పట్టివేత

- రూ.8 లక్షలు డిమాండ్.. రూ.6.5 లక్షలకు ఒప్పందం
- తొలి విడతగా రూ.4 లక్షలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు
- సోదాల్లో మరో రూ.2.5 లక్షల లెక్కల్లో చూపని నగదు స్వాధీనం
- నిందితురాలిని ప్రత్యేక ఏసీబీ కోర్టుకు తరలింపు






**హైదరాబాద్, అక్టోబర్ 5 (ఉద్యమ కెరటం) :** హైదరాబాద్ మెహదీపట్నంలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో లంచం తీసుకుంటున్న టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. గోల్కొండ జోన్ సర్కిల్-33 (మెహదీపట్నం) కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తులసిరామ్ సునీత ఓ భవన నిర్మాణానికి సంబంధించి రూ.4 లక్షల లంచం తీసుకుంటుండగా సిటీ రేంజ్-1 ఏసీబీ అధికారులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. భవన నిర్మాణానికి సంబంధించి డిప్యూటీ కమిషనర్ జారీ చేసిన 'స్పీకింగ్ ఆర్డర్స్'ను పట్టించుకోకుండా నిర్మాణాన్ని కొనసాగించేందుకు అనుమతించడంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా ఉండేందుకు సునీత రూ.8 లక్షలు డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. చివరకు రూ.6.5 లక్షలకు ఒప్పందం కుదిరింది. ఇందులో తొలి విడతగా రూ.4 లక్షలు కార్యాలయంలో స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన సోదాల్లో లెక్కల్లో చూపని మరో రూ.2.5 లక్షల నగదును గుర్తించి సీజ్ చేశారు. అధికారిక విధులను దుర్వినియోగం చేసి అనుచిత లబ్ధి పొందేందుకు ప్రయత్నించిన ఆరోపణలపై సునీతపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదుదారుడి భద్రత, గోప్యత దృష్ట్యా ఆయన వివరాలను వెల్లడించలేదు. విచారణ అనంతరం నిందితురాలు సునీతను నాంపల్లిలోని ప్రత్యేక న్యాయమూర్తి (ఎస్పీఈ, ఏసీబీ) కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ప్రభుత్వ అధికారుల అవినీతికి సంబంధించి ఎవరైనా నిర్భయంగా ఏసీబీని సంప్రదించాలని అధికారులు సూచించారు.

# విద్యుత్ వినియోగదారులకు ట్రూ-అప్ షాక్

- నవంబర్ నుంచి యూనిట్‌కు 30 పైసలు.. డిసెంబర్ నుంచి 50 పైసలు
- రూ.5,420 కోట్ల భారం వినియోగదారులపై.. రైతులకు మినహాయింపు
- ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ పరిధిలో వేర్వేరు కాలపరిమితుల్లో వసూళ్లు
- బిల్లుల్లో ట్రూ-అప్ ఛార్జీలను ప్రత్యేకంగా చూపాలని ఈఆర్సీ ఆదేశం



**హైదరాబాద్, అక్టోబర్ 5 (ఉద్యమ కెరటం):** తెలంగాణ విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం పడనుంది. గత ఆర్థిక సంవత్సరాల్లో విద్యుత్ కొనుగోలు వ్యయం, ఆదాయ వ్యత్యాసాలకు సంబంధించిన ట్రూ-అప్ ఛార్జీల వసూలుకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) అనుమతించింది. దీంతో రాష్ట్రంలోని రెండు విద్యుత్ పంపిణీ సంస్థలైన ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ పరిధిలో నవంబర్ నుంచి అదనపు ఛార్జీల వసూలు ప్రారంభం కానుంది. నవంబర్‌లో యూనిట్‌కు 30 పైసలు, డిసెంబర్ నుంచి యూనిట్‌కు 50 పైసల చొప్పున వసూలు చేయనున్నారు.

### రూ.5,420 కోట్ల భారం

మొత్తం రూ.7,635.22 కోట్ల ట్రూ-అప్ మొత్తంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన రూ.2,214.99 కోట్లను ప్రభుత్వమే భరించాలని ఈఆర్సీ స్పష్టం చేసింది. ఇందులో ఎస్పీడీసీఎల్ పరిధికి రూ.1,442.49 కోట్లు, ఎన్పీడీసీఎల్ పరిధికి రూ.772.50 కోట్లు సబ్సిడీ రూపంలో ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన రూ.5,420.23 కోట్లను ఇతర అర్హత కలిగిన విద్యుత్ వినియోగదారుల నుంచి డిస్కంలు వసూలు చేయనున్నాయి. ఇందులో ఎస్పీడీసీఎల్ పరిధిలో రూ.4,222.93 కోట్లు, ఎన్పీడీసీఎల్ పరిధిలో రూ.1,197.30 కోట్లు ఉన్నాయి.

### రైతులకు మినహాయింపు

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకాన్ని కొనసాగిస్తూ రైతుల కనెక్షన్లకు ట్రూ-అప్ ఛార్జీల నుంచి మినహాయింపు ఇచ్చారు. మిగిలిన వినియోగదారులపై పడే భారాన్ని విడతలవారీగా వసూలు చేయాలని ఈఆర్సీ నిర్ణయించింది. ఎస్పీడీసీఎల్ పరిధిలోని వినియోగదారులు 29 నెలల పాటు, ఎన్పీడీసీఎల్ పరిధిలోని వారు 26 నెలల పాటు ఈ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

### బిల్లుల్లో ప్రత్యేకంగా నమోదు

వినియోగదారుల బిల్లుల్లో ట్రూ-అప్ ఛార్జీలను ఇతర ఛార్జీలతో కలపకుండా ప్రత్యేకంగా ముద్రించాలని ఈఆర్సీ ఆదేశించింది. ఏ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొత్తాన్ని ఆ ఏడాది వివరాలతో విడిగా చూపాలని స్పష్టం చేసింది. ఇప్పటికే విద్యుత్ బిల్లుల భారం ఎదుర్కొంటున్న వినియోగదారులకు కొత్త ఛార్జీల వసూలు మరింత భారంగా మారనుంది.



# నిత్యావసర ధరలపై నియంత్రణ ఏదీ?

### ఆకాశాన్ని అంటుతున్న సన్న బియ్యం ధరలు

### రేవంత్ సర్కార్ నేల చూపులు : హరీష్‌రావు

**హైదరాబాద్, అక్టోబర్ 5 (ఉద్యమ కెరటం) :** నిత్యావసరాల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తుంటే ధరలకు అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండటం దారుణమని బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే, అసెంబ్లీలో పార్టీ ఉప నాయకుడు టి.హరీష్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, పౌరసరఫరాల శాఖ పర్యవేక్షణ వైఫల్యానికి సామాన్య ప్రజలే మూల్యం చెల్లిస్తున్నారన్నారు. సన్న బియ్యం ధరలు నాలుగు నెలల్లోనే 25 శాతం పెరగడం ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రికార్డు స్థాయిలో పంట ఉత్పత్తి సాధించామని గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వం మరి ఉత్పత్తి పెరిగినప్పుడు ధరలు తగ్గాల్సింది పోయి బియ్యం ధరలు ఎందుకు ఆకాశాన్ని అంటుతున్నాయో చెప్పాలని నిలదీశారు. మీరు అమలు చేస్తున్న సన్న బియ్యం పథకం సఫలమైతే ఎందుకు బియ్యం ధరలు అదుపు తప్పుతున్నాయని ఆయన అడిగారు. మీరు ఇస్తున్న నాణ్యత లేని సన్న బియ్యాన్ని ప్రజలు వినియోగించడం లేదని చెప్పడానికి ఇది నిదర్శనం కాక మరేమిటని వ్యాఖ్యానించారు. ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్నకు ఎమ్మెస్పీ పేరిట దక్కుతున్నది నామమాత్రపు ధరేనని, కానీ దళారులకు దక్కుతున్నది క్వింటాకు రూ.8000పై మాటేనని తెలిపారు. రైతుకు గిట్టుబాటు ధర లేదు.. వినియోగదారుడికి అందుబాటు ధర లేదు.. లాభపడుతున్నది మాత్రం దళారులేనని అన్నారు. కళ్ళముందే ఈ తతంగం జరుగుతుంటే ప్రభుత్వంలో ఎందుకు చలనం లేదన్నారు. బియ్యం మాత్రమే కాదు.. ఉల్లి రూ.70, వెల్లుల్లి రూ.240, పల్లినూనె రూ.210, పెసరపప్పు రూ.125, కందిపప్పు రూ.165లకు అడ్డగోలుగా ధరలు పెరిగితే సామాన్య కుటుంబం ఎలా బతకాలన్నారు. వంటింటి బడ్జెట్ తారుమారవుతున్నా పౌరసరఫరాల శాఖ ఏం చేస్తోందని ప్రశ్నించారు. ధరల పర్యవేక్షణ గాలికి పోయిందని ఎద్దేవా చేశారు. ప్రజల జేబులు ఖాళీ అవుతుంటే ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషించడం కాదు.. వెంటనే చర్యలు తీసుకోవాలి అని హితవు పలికారు. బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత, అధిక మార్జిన్లపై తక్షణం నిఘాలు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్న బియ్యం సహా నిత్యావసరాల ధరలకు వెంటనే అడ్డుకట్ట వేసి సామాన్యుడిపై పడుతున్న భారం నుండి ఉపశమనం కల్పించాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు.

# మైనింగ్‌తో రామప్పకు ముప్పు అవాస్తవం

### సమగ్ర శాస్త్రీయ అధ్యయనం తర్వాతే మైనింగ్‌పై ముందుకు

### సింగరేణి యాజమాన్యం స్పష్టీకరణ

**సింగరేణి భవన్, అక్టోబరు 5 (ఉద్యమ కెరటం) :** ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప గుడికి సింగరేణి మైనింగ్‌తో ముప్పు పొంచి ఉందని వస్తున్న వార్తలు అపోహలు, అవాస్తవాలు మాత్రమే అని సింగరేణి యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. సింగరేణి ఆధ్వర్యంలో ములుగు జిల్లా వెంకటాపూర్‌లో చేపట్ట తలపెట్టిన వెంకటాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు విషయంలో సమగ్రంగా శాస్త్రీయ అధ్యయనం చేసిన తర్వాతే ముందుకు వెళ్లాలని నిర్ణయించామని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ విషయంలో భారత పురావస్తు శాఖ, ఇతర ప్రతిష్టాత్మక సంస్థలు శాస్త్రీయంగా అధ్యయనం చేసి ఇచ్చే నివేదికల ఆధారంగానే తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొంది. బాధ్యతాయుతమైన రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థగా ఉన్న సింగరేణి రాష్ట్రానికి చెందిన ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప గుడికి ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం చేకూర్చబోదని, వారసత్వ సంపద పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేసింది. పర్యావరణహితమైన చట్టబద్ధమైన మైనింగ్ కార్యకలాపాలకే అధిక ప్రాధాన్యాలు అని సింగరేణి పునరుద్ఘాటించింది.

# ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం

### సుప్రీంకోర్టులో స్టీఫెన్సన్ ఇంప్లీడ్ పిటిషన్!

**న్యూఢిల్లీ, అక్టోబర్ 06 (ఉద్యమ కెరటం):** రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన 2015 నాటి 'ఓటుకు నోటు' కేసులో అత్యున్నత న్యాయస్థానంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, మాజీ నామినేటెడ్ ఎమ్మెల్యే ఎల్విస్ స్టీఫెన్సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేసు విచారణలో భాగంగా తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ప్రత్యేకంగా ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో తాను కేవలం సాక్షినే కాకుండా నేరుగా బాధితుడినని, అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని స్టీఫెన్సన్ తరపు న్యాయవాదులు ధర్మాసనానికి నివేదించారు. స్టీఫెన్సన్ అభ్యర్థనను పరిశీలించిన భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) నేతృత్వంలోని ధర్మాసనం ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతించింది. అనంతరం కేసుకు సంబంధించిన తదుపరి విచారణను సుప్రీంకోర్టు 10 రోజుల పాటు వాయిదా వేసింది. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. సరిగ్గా ఈ విచారణ సమయానికే స్టీఫెన్సన్ స్వయంగా రంగంలోకి దిగి ఇంప్లీడ్ పిటిషన్ వేయడం తీవ్ర ప్రాధాన్యతను సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారగా, 10 రోజుల తర్వాత జరిగే తదుపరి విచారణపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
మంగళవారం
6 అక్టోబర్ 2026



# ఉగ్రవాదుల చేతిలో 'లోరా'..
# సైన్యానికి కొత్త సవాల్!

## సిమ్ లేదు.. సెల్ టవర్ లేదు.. వైఫైతోనూ పనిలేదు

### కశ్మీర్ అడవుల్లో 'ఘోస్ట్ నెట్‌వర్క్'తో ఉగ్రవాదుల రహస్య సంభాషణలు

**శ్రీనగర్, అక్టోబర్ 5 (ఉద్యమ కెరటం):** సిమ్ కార్డు ఉండదు.. మొబైల్ టవర్‌తో పనిలేదు.. వైఫై అవసరం లేదు.. అయినా కిలోమీటర్ల దూరంలో ఉన్న సహచరులతో రహస్యంగా సమాచారాన్ని పంచుకోవచ్చు. జమ్మూకశ్మీర్ అడవుల్లో ఉగ్రవాదుల ఏరివేత కొనసాగిస్తున్న భద్రతా బలగాలకు ఇప్పుడు 'లోరా' పేరుతో కొత్త సాంకేతిక సవాల్ ఎదురైంది. 'లాంగ్ రేంజ్, లో పవర్' రేడియో కమ్యూనికేషన్ ఆధారిత పరికరాలను ఉగ్రవాదులు వినియోగిస్తున్నట్లు భద్రతా సంస్థలు గుర్తించాయి. సాధారణ మొబైల్ నెట్‌వర్క్‌పై ఆధారపడకపోవడంతో సంప్రదాయ ట్రాకింగ్ వ్యవస్థలకు వీటిని గుర్తించడం కష్టమవుతోందని భద్రతా వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల బద్గాం జిల్లా ఎన్‌కౌంటర్‌లో లష్కరే తయ్యిబా కీలక కమాండర్ ఆసిఫ్ హతమయ్యాడు. అతడి వద్ద స్మార్ట్‌ఫోన్‌కు బదులుగా 'లోరా అల్ట్రా' పేరుతో ఉన్న ప్రత్యేక పరికరం లభించినట్లు భద్ర తా వర్గాలు వెల్లడించాయి. ఇది సాధారణ వాకీటాకీ కాదని, ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్‌కు ఉపయోగించే పరికరమని పేర్కొన్నాయి. హాషిం మూసా సెప్టెంబర్ 29న బద్గాంలో జరిగిన ఆపరేషన్‌లో హతమైనట్లు సైనిక వర్గాలను ఉటంకిస్తూ తాజా కథనాలు పేర్కొన్నాయి.

### అడవుల్లో కనిపించని సమాచార వలయం

తక్కువ శక్తితో పనిచేసే రేడియో ఫ్రీక్వెన్సీల ఆధారంగా ఈ పరికరాలు సమాచారాన్ని ప్రసారం చేస్తాయి. భద్రతా వర్గాల ప్రకారం అడవి ప్రాంతాల్లో సుమారు 10 నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో టెక్స్ట్ సందేశాలు, జీపీఎస్ లొకేషన్లు, అత్యవసర సంకేతాలను పంపే సామర్థ్యం వీటికి ఉంది. ఒక పరికరం నుంచి మరో పరికరానికి సంకేతాలను చేరవేస్తూ ప్రైవేటు కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉండటంతో ఉగ్రవాదులకు దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఇది ఉపయోగపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే 'లోరా' పరికరాలను గుర్తించడం అసాధ్యం అనడం సరికాదు. సాధారణ మొబైల్ ట్రాకింగ్‌తో పోలిస్తే వీటిని గుర్తించడం క్లిష్టమైనప్పటికీ, ప్రత్యేక రేడియో ఫ్రీక్వెన్సీ పర్యవేక్షణ ద్వారా సంకేతాలను గుర్తించే అవకాశముంది. గతంలో ఆపరేషన్ మహదేవ్ సమయంలో అత్యంత ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ పరికరం సిగ్నల్‌ను భద్రతా బలగాలు గుర్తించి ఉగ్రవాదుల స్థావరాన్ని చేరుకున్నట్లు కూడా కథనాలు వెలువడ్డాయి. స్వాధీనం చేసుకున్న పరికరాలు భారత్‌లో అసెంబుల్ చేసినట్లు కనిపించడం లేదని, ముందుగానే కాన్ఫిగర్ చేసి ఎన్‌క్రిప్ట్ చేసిన స్థితిలో సరిహద్దు అవతలి నుంచి చేరి ఉండొచ్చని భద్రతా వర్గాలు అనుమానిస్తున్నాయి. వీటి వెనుక పాకిస్థాన్ సరఫరా వ్యవస్థ, చైనా సాంకేతికతకు సంబంధం ఉండొచ్చన్న కోణాన్నీ సంస్థలు పరిశీలిస్తున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. అయితే పాక్–చైనా సంబంధం ఇప్పటివరకు బహిరంగంగా నిర్ధారితమైన అంశం కాదు; భద్రతా సంస్థల పరిశీలనలో ఉన్న అనుమానంగానే చూడాలి. ఈ కొత్త సమాచార వ్యవస్థను ఎదుర్కొనేందుకు భద్రతా సంస్థలు తమ ఎలక్ట్రానిక్ నిఘా సామర్థ్యాలను మార్చుకుంటున్నాయి. అడవుల్లో లోరా రేడియో ఫ్రీక్వెన్సీలను గుర్తించేందుకు స్పెక్ట్రమ్ స్కానర్లు, జామర్లను తిరిగి సర్దుబాటు చేస్తున్నట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి.

# చట్టవిరుద్ధంగా ఫామ్-6 మార్పులు..

### సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై రాహుల్ గాంధీ ధ్వజం




**న్యూఢిల్లీ, అక్టోబర్ 5 (ఉద్యమ కెరటం):** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫామ్–6లో మార్పులను జ్ఞానేశ్ కుమార్ చట్టవిరుద్ధంగా, బీజేపీకి అనుకూలంగా ఏకపక్షంగా చేశారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేయడంతో రాహుల్ గాంధీ స్పందించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన ఫామ్–6లో చేసిన మార్పులను సుప్రీంకోర్టు ఆమోదించలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. 'మార్చిన ఫామ్–6లో ఏదీ మేం ఆమోదించలేదు. ఎవరు మార్చారో రికార్డులు వచ్చిన తర్వాత చూడాలనుకుంటున్నాం' అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఫామ్–6ను ఎవరి అనుమతితో మార్చారో తెలుసుకునేందుకు సంబంధిత రికార్డులను కోర్టు కోరింది. సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా జ్ఞానేశ్ కుమార్‌పై విమర్శలు చేశారు. ఫామ్–6ను ఆయన చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారని ఆరోపించారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ తన పదవిని దుర్వినియోగం చేసి బీజేపీకి ప్రయోజనం కలిగించేలా వ్యవహరిస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యవహారంలో భాగమైన వారందరినీ బాధ్యులను చేస్తామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, ముగ్గురు ఎన్నికల కమిషనర్ల సమ్మతి లేకుండా ఎన్నికల సంఘంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారన్న పిటిషన్లపై సుప్రీంకోర్టు ఎన్నికల సంఘానికి, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఎన్నికల సంఘం నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీతో తీసుకున్నవా, లేక ఒక్క సీఈసీ మాత్రమే నిర్ణయించారా అనే వివరాలను కోర్టు కోరింది.

# ఆ రికార్డులను మాకు సమర్పించండి..

## ఈసీ నిర్ణయాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశం

- ఫారం-6ను ఎవరు మార్చారో పరిశీలిస్తామన్న సీజేఐ ధర్మాసనం
- జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారన్న పిటిషన్లపై నోటీసులు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 5 (ఉద్యమ కెరటం):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన కీలక నిర్ణయాలను ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్షంగా తీసుకున్నారంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం కీలక విచారణ చేపట్టింది. వివాదాస్పద నిర్ణయాలకు సంబంధించిన అధికారిక రికార్డులను తమ ముందుంచాలని ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ముఖ్యంగా కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం–6లో మార్పులు ఎవరు చేశారు? ఆ నిర్ణయానికి పూర్తి ఎన్నికల కమిషన్ ఆమోదం ఉందా? అనే అంశాలను రికార్డుల ఆధారంగా పరిశీలిస్తామని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించింది. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధూ, వివేక్ జోషితోపాటు సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసింది. ఆరోపణలపై ముందుగా ప్రామాణిక సమాచారం, అధికారిక రికార్డులను పరిశీలించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం పేర్కొంది.

### 'ఫారం-6 మార్పులకు మేం ఆమోదం ఇవ్వలేదు'

విచారణలో ఫారం–6 అంశంపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రత్యేక సమగ్ర సవరణ సందర్భంగా ఉపయోగించిన సవరించిన ఫారం–6కు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందన్న వాదనపై సీజేఐ స్పష్టత ఇచ్చారు. సవరించిన ఫారం–6కు తాము ఆమోదం ఇవ్వలేదని, రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాత ఎవరు, ఏం మార్చారన్నది పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ తీసుకునే నిర్ణయాలు చట్టంలో నిర్దేశించిన సామూహిక నిర్ణయ ప్రక్రియకు అనుగుణంగా ఉండాలని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వికాస్‌సింగ్ వాదించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల మధ్య ఏ అంశంపైనైనా అభిప్రాయ భేదాలు ఉంటే మెజారిటీ అభిప్రాయం ప్రకారమే నిర్ణయం తీసుకోవాలని చట్టం చెబుతోందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాలను పక్కనపెట్టి కొన్ని నిర్ణయాలు తీసుకున్నారన్నది పిటిషనర్ల ప్రధాన ఆరోపణ. అయితే ఈ ఆరోపణలు ఇంకా న్యాయస్థానం నిర్ధారించిన వాస్తవాలు కావు.

### 'రికార్డులు చూశాకే నిర్ణయం'

జ్ఞానేశ్‌కుమార్‌ను తక్షణమే సీఈసీ విధుల నుంచి తప్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని వికాస్‌సింగ్ కోరగా ధర్మాసనం అందుకు అంగీకరించలేదు. మీడియా కథనాలు, ఆరోపణల ఆధారంగా ఏకపక్షంగా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొంది. ముందుగా ఎన్నికల కమిషన్‌తోపాటు ప్రతివాదుల వాదనలు వినాలని స్పష్టం చేసింది. అయితే అధికారిక రికార్డుల పరిశీలనలో ఏదైనా నిర్ణయం చట్టబద్ధమైన ప్రక్రియకు విరుద్ధంగా తీసుకున్నట్లు తేలితే దానిని రద్దు చేసే అధికారం న్యాయస్థానానికి ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీంతో ఫారం–6లో మార్పులు ఎలా జరిగాయి? వాటికి ముగ్గురు సభ్యుల ఎన్నికల కమిషన్ ఆమోదం ఉందా? ఇద్దరు ఎన్నికల కమిషనర్లు నిజంగానే అభ్యంతరాలు నమోదు చేశారా? అన్న అంశాలపై ఈసీ సమర్పించే అధికారిక రికార్డులు ఇప్పుడు కీలకంగా మారనున్నాయి.

# కాంతితో మెదడుకు కళ్లెం..

## వైద్య విభాగంలో ముగ్గురికి నోబెల్

### ఆప్టోజెనెటిక్స్‌లో విప్లవాత్మక పరిశోధనలకు అత్యున్నత పురస్కారం

### కార్ల్ డైసెరోత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాగెల్‌కు సంయుక్తంగా అవార్డు



**స్టాక్‌హోమ్, అక్టోబర్ 5 (ఉద్యమ కెరటం):** వైద్యశాస్త్రంలో విప్లవాత్మక పరిశోధనలకు గుర్తింపుగా 2026 సంవత్సరానికి ముగ్గురు శాస్త్రవేత్తలను నోబెల్ పురస్కారం వరించింది. అమెరికాకు చెందిన కార్ల్ డైసెరోత్, జర్మనీ శాస్త్రవేత్తలు పీటర్ హెగెమాన్, జార్జ్ నాగెల్‌లకు వైద్యశాస్త్రం లేదా శరీరధర్మశాస్త్ర విభాగంలో సంయుక్తంగా నోబెల్ ప్రకటించారు. కాంతికి స్పందించే అయాన్ చానళ్లు, ఆప్టోజెనెటిక్స్ రంగాల్లో వీరు చేసిన ఆవిష్కరణలకు గుర్తింపుగా స్వీడన్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్ నోబెల్ కమిటీ సోమవారం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ ముగ్గురికి మొత్తం 1.2 కోట్ల స్వీడిష్ క్రోనర్ల నగదు బహుమతిని అందజేయనున్నారు.

### కాంతితో నాడీకణాల నియంత్రణ

మెదడు పనితీరును అర్థం చేసుకోవడంలో ఆప్టోజెనెటిక్స్ సాంకేతికత కొత్త అధ్యాయానికి నాంది పలికింది. కాంతిని ఉపయోగించి మెదడులోని నిర్దిష్ట నాడీకణాలను ఉత్తేజితం చేయడం లేదా వాటి కార్యకలాపాలను నిలిపివేయడం ఈ పద్ధతి ప్రత్యేకత. పీటర్ హెగెమాన్, జార్జ్ నాగెల్ ఏకకణ శైవలాల్లో కాంతికి స్పందించే 'చానల్ రోడాప్సిన్' అనే ప్రోటీన్‌ను గుర్తించారు. నీలి కాంతి పడినప్పుడు ఈ ప్రోటీన్‌లోని చానల్ తెరుచుకుని విద్యుత్ ఆవేశం కలిగిన అయాన్లు కణంలోకి ప్రవేశిస్తాయని నిరూపించారు. ఈ పరిశోధనను కార్ల్ డైసెరోత్ మరింత ముందుకు తీసుకెళ్లారు. చానల్ రోడాప్సిన్‌కు సంబంధించిన జన్యువును నాడీకణాల్లో ప్రవేశపెట్టి, కాంతి సాయంతో వాటి కార్యకలాపాలను నియంత్రించవచ్చని చూపించారు. 2005లో నాడీకణాల్లో ఈ ప్రయోగాన్ని విజయవంతంగా ప్రదర్శించిన ఆయన, ఆ తర్వాత జీవించి ఉన్న ఎలుకల మెదడులోనూ ఈ పద్ధతిని అమలు చేశారు. ఈ పరిశోధనలే ఆప్టోజెనెటిక్స్ అభివృద్ధికి పునాదులయ్యాయి. జ్ఞాపకశక్తి, భావోద్వేగాలు, కదలికలు, ప్రవర్తన వంటి ప్రక్రియల్లో మెదడులోని ఏ నాడీకణాలు ఎలాంటి పాత్ర పోషిస్తున్నాయో తెలుసుకునేందుకు ఆప్టోజెనెటిక్స్ శక్తివంతమైన సాధనంగా మారింది. పార్కిన్సన్స్, మూర్ఛ, అల్జీమర్స్ వంటి నాడీ సంబంధిత వ్యాధులతోపాటు మానసిక రుగ్మతలపై పరిశోధనలకు ఈ పద్ధతి ఉపయోగపడుతోంది. దృష్టిలోపం ఉన్నవారికి కొంతమేర చూపును పునరుద్ధరించే చికిత్సల అభివృద్ధిలోనూ దీనిని పరిశీలిస్తున్నారు. అయితే పలు చికిత్సాపరమైన వినియోగాలు ఇంకా పరిశోధన దశలోనే ఉన్నాయి. 1901లో ప్రారంభమైన వైద్యశాస్త్ర నోబెల్ పురస్కారాన్ని ఈ ఏడాదితో కలిపి 117 సార్లు ప్రకటించారు. ఇప్పటివరకు 235 మంది ఈ పురస్కారాన్ని అందుకున్నారు. వైద్యశాస్త్ర నోబెల్ అందుకున్న అత్యంత పిన్న వయస్కుడు ఫ్రెడరిక్ బాంటింగ్. ఇన్సులిన్ ఆవిష్కరణకు చేసిన కృషికి 1923లో ఆయన 32 ఏళ్ల వయసులో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అత్యధిక వయసులో వైద్య నోబెల్ అందుకున్న వ్యక్తి పేటన్ రౌస్. 1966లో ఆయన 87 ఏళ్ల వయసులో ఈ అవార్డును స్వీకరించారు.

# నేరస్తుల గుండెల్లో భయం పుట్టాలి

- అత్యాచార ఘటనలపై సుప్రీంకోర్టు సీరియస్
- ఢిల్లీ పోలీసులకు కీలక ఆదేశాలు!



**న్యూఢిల్లీ, అక్టోబర్ 5 (ఉద్యమ కెరటం):** దేశ రాజధానిలో మహిళలు, బాలికలపై ఇటీవల వెలుగుచూసిన అత్యాచార ఘటనలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మహిళలపై నేరాలకు పాల్పడాలంటేనే దుండగుల మనసుల్లో భయం పుట్టేలా పోలీసుల చర్యలు ఉండాలని స్పష్టం చేసింది. నేరం జరిగిన తర్వాత నిందితులను పట్టుకోవడానికే పరిమితం కాకుండా.. నేరం జరగకుండా నిరోధించడమే పోలీసుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని పేర్కొంది. మహిళలు రాత్రి వేళల్లోనూ రోడ్లపై నడిచేటప్పుడు, ప్రజా రవాణాను ఉపయోగించేటప్పుడు సురక్షితంగా ఉన్నామనే భావన కలిగే పరిస్థితి ఉండాలని వ్యాఖ్యానించింది. ఢిల్లీ––ఎన్‌సీఆర్‌లో ఇటీవల జరిగిన అత్యాచారాలు, లైంగిక దాడుల ఘటనలను సుమోటోగా స్వీకరించిన కేసును జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ఆస్తా కుంజ్ పార్కులో 17 ఏళ్ల బాలికపై జరిగినట్లు ఆరోపిస్తున్న సామూహిక అత్యాచారం సహా పలు ఘటనలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు సెప్టెంబర్ 28నే ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించింది. మహిళలు, చిన్నారులు హింస భయం లేకుండా గౌరవంగా జీవించే హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో అంతర్భాగమని కోర్టు పేర్కొంది. పోలీసుల పెట్రోలింగ్, నిఘా వ్యవస్థ మరింత పటిష్టంగా ఉండాలని ధర్మాసనం పేర్కొంది. పార్కులు, బస్‌స్టాప్‌లు, మెట్రో స్టేషన్లు, బస్ టెర్మినళ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో భద్రతను బలోపేతం చేయాలని గత విచారణలోనే ఆదేశించింది. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడంతోపాటు అక్కడ లైటింగ్, సీసీటీవీ వ్యవస్థలను తనిఖీ చేసి లోపాలను సరిచేయాలని స్పష్టం చేసింది. మహిళలపై నేరాలకు పాల్పడే వారిలో చట్టమంటే భయం కలిగేలా పోలీసుల ఉనికి, చర్యలు ఉండాలని తాజా విచారణ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేవలం నేరం జరిగిన తర్వాత కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేయడం కాకుండా, ముందస్తు నిఘాతో నేరానికి అవకాశమే లేకుండా చేయాలని సూచించింది. అయితే పెట్రోలింగ్ పేరుతో పోలీసులు అతిగా వ్యవహరించకూడదన్న అంశాన్నీ కోర్టు ప్రస్తావించింది. పార్కులు, ఇతర సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోనే బాధ్యత ముగిసిపోదని ధర్మాసనం అభిప్రాయపడింది. కెమెరాల్లో నమోదయ్యే దృశ్యాలను సమర్థంగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థ ఉండాల్సిన అవసరాన్ని ప్రస్తావించింది. అనుమానాస్పద కదలికలను గుర్తించిన వెంటనే క్షేత్రస్థాయి పోలీసులను అప్రమత్తం చేసే విధానం అవసరమని పేర్కొంది. ఢిల్లీ పోలీసుల్లో ఖాళీలు, సిబ్బంది అందుబాటు అంశాలను అమికస్ క్యూరీ సీనియర్ న్యాయవాది లిజ్ మాథ్యూ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. సమర్థవంతమైన పెట్రోలింగ్‌కు తగిన సిబ్బంది, శిక్షణ కూడా కీలకమని విచారణ సందర్భంగా చర్చ జరిగింది. సెప్టెంబర్ 28న ఇచ్చిన ఆదేశాలు కేవలం కాగితాలపై మిగిలిపోకుండా వాస్తవంగా అమలవుతున్నాయా అన్నదే తమకు ముఖ్యమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తొలి ఉత్తర్వుల్లోనూ ప్రకటించిన పథకాలు ఎంతవరకు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాయో సమగ్ర స్థితిగతుల నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించింది.

# ఉష మృతి పట్ల ఎమ్మెల్యే రాగమయి సంతాపం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఎస్కే ఖాదర్ బాబా సతీమణి ఉష హైదరాబాద్లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. ఆమె మృతి పట్ల పలువురు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఉష మృతి విషయం తెలుసుకున్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ సోమవారం సత్తుపల్లిలోని ఖాదర్ బాబా నివాసానికి వెళ్ళి ఉష పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఖాదర్ బాబాతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఉష ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రైల్వే స్టేషన్ ఏరియాలో గల అంగన్వాడి కేంద్రంలో ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ స్వరూప రాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా పోషణ మాసంపై తల్లులు, పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఉప సర్పంచ్ కుమ్మరి సత్య నారాయణ, వార్డు సభ్యురాలు కలవేణి భాగ్య, పుల్గం తిరుపతి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమాదేవి, అంగన్వాడీ టీచర్లు విజయలక్ష్మి, లీలారాణి, ప్రమిళ, నాగమణి, పూలవతి, భాగ్య, విజయ, కిషోర బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాలతో, బెల్లంపల్లి వైస్ ప్రెసిడెంట్ సూచన మేరకు గత ఆర్థిక సంవత్సరం 2025-26కి వచ్చిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలని టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. వచ్చిన లాభాల్లో ఎలాంటి మినహాయింపులు లేకుండా 36 శాతాన్ని కార్మికులకు కేటాయించాలని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం తరపున ఏరియా వర్క్షాప్ ఇన్చార్జ్ నరేష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా వర్క్షాప్ పిట్ సెక్రటరీ గాజవెని శ్రీనివాస్, సెంట్రల్ కమిటీ సభ్యులు డి.మంగీలాల్, ఏరియా జాయింట్ సెక్రటరీ జి.వెంకట్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ ఎస్.సురేష్, నాయకులు గణపతి, వైకుంఠం, వెంకటేశ్వర్లు, కనకయ్య, వెంకటస్వామి, అంజయ్య, చంద్రయ్య, మహిళా కార్మికులు, వర్క్షాప్ కార్మికులు పాల్గొన్నారు.

# పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో చార్జీలు పెంపు

## ఈనెల 7న ఆటోల బంద్



**ఉద్యమ కెరటం, తాండూర్:** పెరుగుతున్న నిత్యావసర వస్తువులు, గ్యాస్, డీజిల్, పెట్రోల్, లూబ్రికెంట్స్, స్పేర్ పార్ట్స్ ధరలను పరిగణనలోకి తీసుకుని ఆటో చార్జీలను పెంచాలని తాండూర్ మండల ఆటో కార్మికులు నిర్ణయించారు. ఈ మేరకు ఈనెల 7న బంద్ నిర్వహించనున్నట్లు మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ పాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు ఆరేళ్ల క్రితం డీజిల్ ధర రూ.54 ఉన్న సమయంలో ఆటో చార్జీలను పెంచినట్లు తెలిపారు. ప్రస్తుతం ఇంధనంతో పాటు ఇతర ఖర్చులు భారీగా పెరగడంతో ఆటో నడుపుతూ కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందన్నారు. ఉచిత బస్సు సౌకర్యం కారణంగా కూడా ఆటో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస ఆటో చార్జీని రూ.20గా, బెల్లంపల్లికి రూ.30గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కొత్త చార్జీలు ఈనెల 7వ తేదీ అర్ధరాత్రి నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. ఆటో కార్మికుల ఇబ్బందులను ప్రజలు అర్థం చేసుకుని సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఆటో యూనియన్ నాయకులు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# చదువులమ్మకు ఆర్థిక కష్టాలు

- నీట్ లో 507వ ర్యాంక్.. రిమ్స్ లో వైద్య విద్య సీటు
- స్పైనల్ కార్డ్ ఇన్ఫెక్షన్తో మంచానికే పరిమితమైన తల్లి..
- చదువు కొనసాగించేందుకు దాతల సాయం కోసం ఎదురుచూపులు



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నా పట్టుదలతో చదివి నీట్లో ర్యాంక్ సాధించి రిమ్స్ లో వైద్య విద్య సీటు పొందిన కాగజ్నగర్కు చెందిన విద్యార్థిని సిందం దీప్తికి ఇప్పుడు ఆర్థిక సాయం అవసరమైంది. కుటుంబ పరిస్థితులు ఆమె వైద్య విద్యను కొనసాగించేందుకు అడ్డంకిగా మారాయి. కాగజ్నగర్ పట్టణంలోని బాలాజీనగర్కు చెందిన సిందం దీప్తి కష్టపడి చదివి నీట్లో 507వ ర్యాంక్ సాధించింది. వైద్య విద్యకు సీటు లభించడంతో సెప్టెంబర్ 18న ప్రొవిజనల్ అడ్మిషన్ లెటర్ అందుకుంది. ఆమె తండ్రి సిందం రాజేందర్ కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మరోవైపు దీప్తి తల్లి సిందం మల్లీశ్వరి స్పైనల్ కార్డ్ ఇన్ఫెక్షన్తో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. ఆమె చికిత్స, మందులు, ఇతర అవసరాల కోసం ఇప్పటికే సుమారు రూ.12 లక్షల వరకు ఖర్చు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది.

### ఓవైపు తల్లి చికిత్స.. మరోవైపు కుమార్తె చదువు

ఒకవైపు తల్లి వైద్య ఖర్చులు, మరోవైపు కుమార్తె వైద్య విద్యకు అయ్యే ఖర్చులు రాజేందర్పై భారంగా మారాయి. ఇప్పటి వరకు పుస్తకాలు, వసతి, ప్రయాణ ఖర్చులను ఎలాగోలా సమకూర్చుకుంటూ దీప్తిని చదివించిన కుటుంబం.. ప్రస్తుతం ఆమె వైద్య విద్యకు అవసరమైన ఖర్చులను భరించే పరిస్థితిలో లేదని వాపోయింది. చదువులో ప్రతిభ కనబర్చి వైద్యురాలిగా ఎదిగి సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో దీప్తి ముందుకు సాగుతోంది. ఆమె పరిస్థితిని గుర్తించి దాతలు, సేవా సంస్థలు, దాతృత్వ హృదయం కలిగిన వ్యక్తులు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీప్తి వైద్య విద్య కొనసాగించేందుకు సహాయం చేయాలనుకునే వారు 8008013207, 6305921645 నంబర్లలో సంప్రదించాలని కుటుంబ సభ్యులు కోరారు.

# ప్రజా సమస్యలపై మంత్రి తుమ్మల దృష్టి

- గండుగులపల్లిలో మంత్రి తుమ్మలను కలిసిన పలువురు ప్రముఖులు, రైతులు

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాలకు చెందిన పలువురు సీనియర్ నాయకులు, తుమ్మల అభిమానులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి తమ సమస్యలను వివరించారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ మంత్రికి వినతి పత్రాలను సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్థానిక శాసనసభ్యుల సహకారంతో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అదేవిధంగా ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం తన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రజల



సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఫార్మసీ రంగంలో విద్యార్థుల పాత్ర కీలకం

**ఉద్యమ కెరటం, నర్సాపూర్:** మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపల్ పట్టణ సమీపంలోని విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (వైపర్) కళాశాలలో నూతన విద్యార్థుల పరిచయ వేదిక ఇండక్షన్ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విష్ణు విద్యా సంస్థల చైర్మన్ కె.విష్ణురాజు, డా.రవిచంద్రన్ రాజగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విష్ణురాజు ఫార్మసీ రంగం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. అనేక రకాల ఔషధాల తయారీలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని అన్నారు. కోవిడ్ వ్యాక్సిన్ తయారీలోనూ ఫార్మసీ రంగానికి చెందిన నిపుణుల కృషి ఉందన్నారు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ఫార్మసీ రంగంలో విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. మెడికల్ షాపుల్లో మందులు అందించే వారు తప్పనిసరిగా ఫార్మసీ విద్యను అభ్యసించిన వారై



ఉండాలని అన్నారు. హైదరాబాద్ పరిసరాల్లో అనేక ఫార్మా పరిశ్రమలు ఉన్నాయని, విద్యార్థులు వాటిని సందర్శించి పరిశ్రమల పనితీరు, ఔషధ తయారీ ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రస్తుత కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ప్రాధాన్యత పెరుగుతోందని, విద్యార్థులు ఆధునిక



సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థుల భవిష్యత్ అవకాశాలను దృష్టిలో ఉంచుకొని కళాశాలలో జపనీస్ భాషతో పాటు వివిధ విదేశీ కోర్సులను కూడా బోధిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో.వైపర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్గా డాక్టర్ ఆడె క్రాంతి కుమార్

- నియామక పత్రాలు అందజేసిన అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆదిలాబాద్ జిల్లా బ్రాంచ్ ఎన్నికల్లో ఊహించినట్లుగానే డాక్టర్ ఆడె క్రాంతి కుమార్, రాథోడ్ జైసింగ్ ల హవా నడిచింది. ఆదివారం హోరాహోరీగా జరిగిన మేనేజింగ్ కమిటీ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సాధించిన డాక్టర్ ఆడె క్రాంతి కుమార్ ప్రతిష్టాత్మకమైన రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు. మరోవైపు రాథోడ్ జైసింగ్ 946 ఓట్ల భారీ మెజార్టీ సాధించి రికార్డ్ స్థాయి విజయాన్ని సొంతం చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల అధికారి, జెడ్పీ సీఈఓ బి.రవి పర్యవేక్షణలో అక్టోబర్ 4న జెడ్పీపీ కాన్ఫరెన్స్ హాల్లో రహస్య ఓటింగ్ పద్ధతిలో పోలింగ్ నిర్వహించారు. మొత్తం 15 మంది కమిటీ సభ్యుల స్థానాల కోసం 46 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, ఓటర్లు డాక్టర్ ఆడె క్రాంతి కుమార్, రాథోడ్ జైసింగ్ల నాయకత్వానికి బ్రహ్మరథం పట్టారు. ఈ ఎన్నికల్లో వీరిద్దరితో పాటు బండారి కృష్ణ, నెమ్మని రాజేశ్వర్ రావు, జొంపల్లి సంజీవ్ రావు, నాంపెల్లి సౌందర్య, భాగత్ సునీత కుమారి, సామ రూపేష్ రెడ్డి, చింతకుంట వెంకట నారాయణ రాజు, సామె రమేష్ రెడ్డి, మామిడిపల్లి మనోహర్, మాసం అనిల్, కుర్మే విశ్వనాథ్, పట్వార్ గజానన్, కొరద్య పార్థ సారథిలు కూడా మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన ఈ కార్యవర్గం రాబోయే మూడేళ్ల పాటు జిల్లాలో రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలను విస్తరించనుంది. చైర్మన్గా ఎన్నికైన డాక్టర్ ఆడె క్రాంతి కుమార్, భారీ మెజార్టీ సాధించిన రాథోడ్



జైసింగ్లకు జిల్లాలోని పలువురు ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

# పారదర్శకంగా భవన నిర్మాణ అనుమతులు

## టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సుమలత

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లా కేంద్రంలో భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ నిబంధనల ప్రకారం పారదర్శకంగా కొనసాగుతోందని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సుమలత తెలిపారు. ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకు మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులు, వాటి పరిశీలన, ఎయిర్పోర్ట్ జోన్ పరిధిలోని లేఅవుట్లపై తీసుకుంటున్న చర్యలకు సంబంధించిన వివరాలను శనివారం వెల్లడించారు. ఏప్రిల్ నుంచి మున్సిపల్ పరిధిలోని రెసిడెన్షియల్ విభాగాల్లో 327 దరఖాస్తులు అందగా, నిబంధనలకు అనుగుణంగా ఉన్న 303 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే వాణిజ్య సముదాయాల నిర్మాణానికి సంబంధించి 51 దరఖాస్తులు రాగా, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం నిబంధనలకు అనుగుణంగా ఉన్న 26 దరఖాస్తులకు అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. మిగిలిన దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదిలాబాద్ ఎయిర్పోర్ట్ జోన్ ప్రభావిత ప్రాంతాల్లోని లేఅవుట్లు, భవన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన సమగ్ర నివేదికలను ఉన్నతాధికారులకు ఇప్పటికే పంపించినట్లు వివరించారు. నిబంధనల మేరకు కొన్ని అనుమతులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ అనుమతులు పొందిన తర్వాతే భవన నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు.



# పరిశ్రమల అనుసంధానంతో సాంకేతిక నైపుణ్యాలు

**ఉద్యమ కెరటం, నర్సాపూర్:** పరిశ్రమలతో అనుసంధానమై నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంతో పాటు, పరిశోధన రంగంలో రాణించాలని విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ కె.విష్ణు రాజు విద్యార్థులకు సూచించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపల్ పట్టణ సమీపంలోని బి.వి.రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ)లో ఎంటెక్ ప్రథమ సంవత్సరం నూతన విద్యార్థుల ఇండక్షన్ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బీవీఆర్ఐటీ పూర్వ విద్యార్థుల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రముఖ పరిశ్రమలు, ఈవీటీ టెక్నాలజీస్, ఇంజినీరింగ్ డిజైన్ సంస్థలతో కళాశాల అకడమిక్–ఇండస్ట్రీ భాగస్వామ్యాలను కొనసాగిస్తోందన్నారు. వీటి ద్వారా ఎంటెక్ విద్యార్థులకు ఇంటర్న్షిప్, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దేశంలోని ప్రముఖ ఐఐటీలతో పరిశోధన, అకాడమిక్ సహకారాన్ని కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. క్యాంపస్లో అందుబాటులో ఉన్న ఆధునిక పరిశోధన ప్రయోగశాలలు, ఇతర సదుపాయాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ ఛైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ ఉన్నత విద్య ప్రాధాన్యతను వివరించారు. పీహెచ్డీ, పోస్ట్ డాక్టరల్ పరిశోధనలతో పాటు అకడమియా–పరిశ్రమల మధ్య



బలమైన సంబంధాలను ఏర్పరుచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్ దూబే, వంశీకృష్ణ, మురళీకృష్ణ, కాంతారావు, కళాశాల మేనేజర్ బి.బాపిరాజు, సురేష్, మల్లికార్జున్, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో అంగన్వాడీ ఉత్సవాలు

**ఉద్యమ కెరటం, తాండూర్:** భారతీయ జనతా పార్టీ తాండూర్ మండల శాఖ ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్లో భాగంగా సోమవారం అంగన్వాడీ ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలను ఘనంగా సత్కరించారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించి గౌరవించడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు.మండలంలోని బోయపల్లి అంగన్వాడీ కేంద్రంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చిలుముల శ్రీకృష్ణదేవ





రాయల ఆధ్వర్యంలో, బోయపల్లి బోర్డు అంగన్వాడీ కేంద్రంలో బీజేపీ సీనియర్ నాయకుడు పులగం తిరుపతి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దూడపాక భరత్ కుమార్, జిల్లా కార్యదర్శి రామగౌని మహిధర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, సీనియర్ నాయకులు చోక్కాల నాగభూషణ్, సోషల్ మీడియా కన్వీనర్ కామెర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనిధి రుణాలు సకాలంలో చెల్లించాలి

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** శ్రీనిధి రుణాల మొండి బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించి, స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాలను సకాలంలో చెల్లించేలా అవగాహన కల్పించాలని ఏపీఎం మోహన్దాస్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని దివ్యజ్యోతి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం అధ్యక్షతన సిబ్బంది రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనిధి రుణాలను సభ్యులు సక్రమంగా సద్వినియోగం



చేసుకుంటే వాటిని సకాలంలో తిరిగి చెల్లించడం సులభమవుతుందని అన్నారు. సంఘాల బలోపేతానికి సిబ్బంది క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి సభ్యులకు అవసరమైన సూచనలు, అవగాహన కల్పించాలని ఆదేశించారు. మొండి బకాయిలను తగ్గించి రుణ చెల్లింపుల ప్రక్రియను మెరుగుపర్చేందుకు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఈ సమావేశంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్లు సుశీల, భద్రయ్య, రంగయ్య, కల్పన, మండల మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

# ఆదివాసీ ఆత్మగోస మహాధర్నాను జయప్రదం చేయండి

**ఉద్యమ కెరటం, జైనూర్:** ఆదివాసీల సమస్యలు, హక్కుల పరిరక్షణ కోసం ఈనెల 14న హైదరాబాద్లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్ ఆదివాసీ ఆత్మగోస మహాధర్నా'ను జయప్రదం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం జైనూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఎదుట మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, భూమి, రిజర్వేషన్లు, చట్టపరమైన రక్షణకు సంబంధించిన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1/70 చట్టంపై సుప్రీం కోర్టులో ఉన్న కేసులో ఆదివాసీల పక్షాన ప్రభుత్వం కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని, లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జీఓ నం.3 స్థానంలో కొత్త జీఓ తీసుకురావడానికి ఆదివాసీ ఎమ్మెల్యేలు, ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ తీర్మానం చేయాలని, రిజర్వ్ ఫారెస్ట్లో ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఆదివాసీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం నిర్వహించే మహాధర్నాకు ఆదివాసీలు, యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గేడం గోపీచంద్, ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సెడ్మాకి భగవంత్రావు, గేడం గణపత్రావు, సార్మేడి పెందోర్ అర్జున్, సర్పంచ్ సిడం రాము, కొలం




సంఘం నాయకులు ఆత్రం దేవరావు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు వెంకటస్వామి





## డీసీపీ ఎ.భాస్కర్

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** కార్మికులు, పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన కార్మిక పక్షపాతి, సామాజిక సేవకుడు గడ్డం వెంకటస్వామి (కాకా) అని డీసీపీ ఎ.భాస్కర్ అన్నారు. సోమవారం కాకా జయంతిని పురస్కరించుకుని నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దుర్గం ఎల్లయ్యతో కలిసి డీసీపీ ఎ.భాస్కర్ వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ దేశ ప్రగతికి కార్మికులే పునాది అనే విశ్వాసంతో వెంకటస్వామి జీవితాంతం కార్మికుల కోసం పనిచేశారని తెలిపారు. కార్మికులకు వేతనాలతో పాటు 'డిగ్నిటీ ఆఫ్ లేబర్' గౌరవం దక్కాలనే భావనతో కృషి చేశారని పేర్కొన్నారు. సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టారని, పేదలు, గుడిసెల్లో నివసించే ప్రజలకు నివాస సౌకర్యం కల్పించేందుకు కృషి చేశారని తెలిపారు. జాతీయ గుడిసెల సంఘం ద్వారా దాదాపు 30 కాలనీల్లో ఇళ్ల ఏర్పాటుకు కృషి చేసి పేద ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పునకు కారణమయ్యారని అన్నారు. ప్రతిఒక్కరికీ విద్య అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టడంతో పాటు కార్మికులు, పేదల సంక్షేమం కోసం వెంకటస్వామి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రస్తుత కాలంలో పెద్ద సంఖ్యలో ఉపాధి పొందుతున్న గిగ్ వర్కర్ల సంక్షేమానికి సంబంధించిన చర్యలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ఖాన్, జిల్లా అల్పసంఖ్యాకుల సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ క్రాంతి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, యువజన క్రీడా సేవల అధికారి హనుమంత్రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదుకు స్పందన

## బతుకమ్మ ఘాట్, ఆట స్థలంపై అధికారుల పరిశీలన

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండలం ముస్తఫానగర్ గ్రామ అభివృద్ధిలో భాగంగా గ్రామస్తులు ప్రజావాణిలో చేసిన ఫిర్యాదుపై గంభీరావుపేట మండల తహశీల్దార్ సానుకూలంగా స్పందించారు. ఫిర్యాదు మేరకు గ్రామ శివారులోని బతుకమ్మ ఘాట్, ఆటస్థలానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించేందుకు ఆర్ఐ, జీపీఓలను పంపించారు. అధికారులు ముస్తఫానగర్ గ్రామ శివారులోని బతుకమ్మ ఘాట్, ఆటస్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామస్తుల సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్న ఆర్ఐ, జీపీఓలు స్థల పరిస్థితిని పరిశీలించి సానుకూలంగా స్పందించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టే దిశగా పరిశీలన చేసినట్లు తెలిపారు. ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో ముస్తఫానగర్ బతుకమ్మ జాగృతి సంస్థ అధ్యక్షులు గౌరీగారి నాగరాజు గౌడ్, వార్డు సభ్యులు దోమకొండ కృష్ణకాంత్ యాదవ్, ముస్తఫానగర్ మాజీ వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షులు బండ రమేష్, సభ్యులు కుడుకల తిరుపతి, బండ రవికుమార్తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రజావాణిలో చేసిన ఫిర్యాదుపై అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. బతుకమ్మ ఘాట్, ఆటస్థల అభివృద్ధికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.



# ప్రజావాణికి రెండు ఫిర్యాదులు

**ఉద్యమ కెరటం, మద్నూర్:** మద్నూర్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిలు, తహశీల్దార్ ఎండీ.ముజీబ్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం రెండు ఫిర్యాదులు అందాయి. ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, నిబంధనల మేరకు సమగ్రంగా పరిశీలించి అర్హత ఆధారంగా సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులో చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి, పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజావాణికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు, వారి సమస్యలను సానుకూలంగా విని నిబంధనల పరిధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్నూర్ మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఏకలవ్య పాఠశాలను రాష్ట్రంలో నంబర్ వన్గా నిలపాలి

## జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**ఉద్యమ కెరటం, కామారెడ్డి:** గాంధారి ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను రాష్ట్రస్థాయిలో నంబర్ వన్గా నిలిపేందుకు అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల జిల్లా స్థాయి పాలక మండలి సమావేశంలో పాఠశాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన విద్య, వసతులు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి పాలక మండలి సభ్యులు వారానికి ఒకరు చొప్పున పాఠశాలను సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పాఠశాలలో చేపడుతున్న ఇంజినీరింగ్ పనులను ఈ నెలలోనే పూర్తి చేస్తామని డీఈఈ సంపత్ కుమార్ కలెక్టర్కు వివరించారు. తదుపరి పాలక మండలి సమావేశాన్ని జనవరిలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్ నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి పి.చంద్రశేఖర్, ప్రాంతీయ సమన్వయ అధికారి గంగారాం నాయక్, జిల్లా సంక్షేమ అధికారి సౌజన్య, ప్రధానాచార్యులు శ్యామలదేవి, అమర్సింగ్, మాధవరావు, రవీంద్రకుమార్, సంతోష్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సాయం

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** అనారోగ్యంతో మృతిచెందిన జర్నలిస్టు ఏడబోయిన నారాయణ కుటుంబానికి తోటి జర్నలిస్టులు అండగా నిలిచారు. గంభీరావుపేట మండలం కోలమద్ది గ్రామానికి చెందిన నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మండలంలోని టీయూడబ్ల్యూజే–ఐజేయూ జర్నలిస్టులు ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. మండలంలోని జర్నలిస్టులంతా కలిసి సేకరించిన రూ.10వేల ఆర్థిక సహాయాన్ని నారాయణ భార్య సరితకు సోమవారం అందజేశారు. కష్టకాలంలో జర్నలిస్టు కుటుంబానికి తోటి జర్నలిస్టులు అండగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ నారాయణ కుటుంబానికి తమవంతు సహకారం అందిస్తామని జర్నలిస్టులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ మండల అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్, జర్నలిస్టు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు జైనూర్ ఆసుపత్రిలో సదరం క్యాంప్



**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం సదరం క్యాంప్ నిర్వహించనున్నట్లు వికలాంగుల మండల అధ్యక్షుడు మెస్రం నాగోరావు తెలిపారు. మండల పరిధిలోని అర్హులైన వికలాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సదరం సర్టిఫికెట్ కోసం వైద్య పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో అర్హులు అవసరమైన ధ్రువపత్రాలతో క్యాంప్కు హాజరు కావాలని సూచించారు. సదరం సర్టిఫికెట్ ద్వారా ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు, వికలాంగుల పెన్షన్ తదితర ప్రయోజనాలను పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరూ సదరం క్యాంప్ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# బెజ్జూర్ ఎస్సైగా రమేష్ బాధ్యతల స్వీకరణ




**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** బెజ్జూర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా ఆర్.రమేశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తొలి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, అక్రమ మద్యం రవాణా, ఇసుక అక్రమ తరలింపుపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపడతామని పేర్కొన్నారు. గ్రామాల్లో పోలీసులు, ప్రజల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి గ్రామంలో పర్యటిస్తామని చెప్పారు. ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ స్టేషన్కు వచ్చి తెలియజేయాలని, పోలీసులు 24 గంటలు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆడే గజేందర్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజల మధ్య ఉంటున్న కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. పదవులతో సంబంధం లేకుండా ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ జనానికి చేరువగా ఉంటున్నారు. సమాజంలోని వివిధ వర్గాలతో సన్నిహితంగా మెలుగుతూ వృద్ధులకు అండగా నిలవడంతో పాటు యువత సమస్యలపై స్పందిస్తున్నారు. బోథ్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై స్పందిస్తూ తనవంతు సహకారం అందిస్తున్నారు. ఆయన కలుపుగోలుతనం, నిరాడంబరత్వం ప్రజలకు మరింత చేరువ చేశాయని అనుచరులు పేర్కొంటున్నారు. రైల్వేలో సీనియర్ సెక్షన్ ఇంజినీర్గా పనిచేసిన ఆయన ప్రజాసేవ చేయాలనే ఉద్దేశంతో ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటి నుంచి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. రాజకీయంగా భిన్న అభిప్రాయాలు ఉన్నవారితోనూ స్నేహపూర్వకంగా మెలగడం, అందరినీ కలుపుకొని ముందుకు సాగడం ఆయన ప్రత్యేకతగా అనుచరులు చెబుతున్నారు. ప్రజలతో మమేకమై సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న ఆడే గజేందర్ మరింత ప్రజాసేవ చేయాలని ఆయన అభిమానులు, అనుచరులు ఆకాంక్షిస్తున్నారు.

# ఐఆర్సీఎస్ చైర్మన్ క్రాంతి కుమార్ కు శుభాకాంక్షలు వెల్లువ



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ (ఐఆర్సీఎస్) ఆదిలాబాద్ జిల్లా నూతన చైర్మన్గా బాధ్యతలు చేపట్టనున్న డాక్టర్ ఆడే క్రాంతి కుమార్కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా గుడిహత్నూర్ సర్పంచ్ ఆడే శీల రాజేశ్వర్, యువజన కాంగ్రెస్ నాయకులు ఆడే క్రాంతి సోమవారం ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సేవలో నిరంతరం ఉంటూ, నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ఆడే క్రాంతి కుమార్ నాయకత్వంలో రెడ్క్రాస్ సొసైటీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన ఆధ్వర్యంలో జిల్లాలో మరిన్ని సామాజిక, సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఐఆర్సీఎస్ ఎన్నికల్లో సభ్యులుగా భారీ మెజారిటీతో విజయం సాధించిన డాక్టర్ ఆడే క్రాంతి కుమార్కు, ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించిన రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ లకు అభినందనలు తెలిపారు.

# రాజన్న ఆలయ అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

- **80 ఫీట్ల రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేయాలి: రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్**




**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. వేములవాడ పట్టణంలో వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం, 80 ఫీట్ల రోడ్డు, బద్ది పోచమ్మ ఆలయం తదితర నిర్మాణ పనులపై సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఆర్అండ్బీ సీఈ రాజేశ్వర్రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పనుల పురోగతిని వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పనులపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు చరిత్రలో నిలిచిపోయేలా ఉండాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న భక్తుల రద్దీతో పాటు భవిష్యత్లో పెరిగే రద్దీకి అనుగుణంగా ప్రణాళిక రూపొందించి అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ప్రతి పనికి గడువు నిర్ణయించి అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులపై ప్రత్యేక దృష్టి సారించారని, అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలో త్వరలో నిర్వహించనున్న పుష్కరాలకు సంబంధించి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేలా ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులను పూర్తి చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. అధికారులు ఈ పనులను తమ బాధ్యతగా భావించి పూర్తిస్థాయిలో నిమగ్నమై వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను ప్రతి వారం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని తెలిపారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ వేగంగా పూర్తి చేసేలా అధికారులకు సూచనలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, వేములవాడ ఆర్డీఓ కేవస్పీ కుమారి, ఈఈ భీమ్లానాయక్, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈఓ రమాదేవి, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఎం.శ్రీనివాస్, ఆలయ ఈఈ రాజేష్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహశీల్దార్ జయంత్, వీటీఏడీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి, వాటిని సత్వరమే పరిష్కరించేందుకే మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి బండారు ప్రవీణ్ కుమార్ తెలిపారు. సోమవారం బెజ్జూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆరు ఫిర్యాదులను స్వీకరించినట్లు ఆయన పేర్కొన్నారు. గత రెండు నెలల్లో ఆరు వారాల పాటు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 68 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. వీటిని శాఖల వారీగా క్రోడీకరించి, పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్లు వివరించారు. ప్రధానంగా భూ సమస్యలు, స్థానిక సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధిహామీ పనులు, అంగన్వాడీ తదితర అంశాలపై ప్రజలు ఫిర్యాదులు సమర్పిస్తున్నారని తెలిపారు. ప్రజావాణి ద్వారా ప్రజలకు అధికార యంత్రాంగం మరింత చేరువవుతుందని, సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ భీమ్లా నాయక్, మండల వ్యవసాయ అధికారి భానోత్ నాగరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి

- **ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలి**
- **క్రైమ్ రివ్యూ సమావేశంలో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర**



**ఉద్యమ కెరటం, కామారెడ్డి:** జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర పోలీసు అధికారులను ఆదేశించారు. కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం క్రైమ్ రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారం, ప్రజా భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలు, మహిళల భద్రత, కమ్యూనిటీ పోలీసింగ్పై సమీక్షించారు. గ్రేవ్, నాన్గ్రేవ్, మిస్సింగ్, ఎన్బీడబ్ల్యూ కేసుల పురోగతిని పరిశీలించి, లాంగ్ పెండింగ్ కేసులు, మిస్సింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. గ్రేవ్ కేసుల్లో శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలతో సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాద ప్రాంతాలను హాట్స్పాట్లుగా గుర్తించి, అవసరమైన చోట ప్రమాద సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆర్థిక, సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, జూదంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చట్టవిరుద్ధంగా జూదం నిర్వహించే, ఆడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్హెచ్ఓలను ఆదేశించారు. మహిళల భద్రతపై షీ టీమ్స్ అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. దుర్గా నవరాత్రుల సందర్భంగా ముందస్తు ప్రణాళికతో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. రౌడీషీటర్లు, కేడీలు, అనుమానితుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. ప్రతి గ్రామంలో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లతో పాటు కీలక ప్రాంతాల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుకు చొరవ చూపాలని సూచించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కె.నర్సింహా రెడ్డి, డీఎస్పీలు మధుసూదన్, శ్రీనివాసరావు, గట్టుమల్లు, విజయభాస్కర్, ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- **ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత సులభతరం చేయాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రజలకు సంబంధించిన భూ సమస్యలను సుదీర్ఘకాలం పెండింగ్లో ఉంచకుండా, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్మల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, భూ సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, గృహ నిర్మాణాల పురోగతిపై మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. భూ రికార్డుల్లో పారదర్శకత, ఖచ్చితత్వం ఉండేలా చూడాలని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ సేవలను మరింత సులభతరం చేయాలని మంత్రి సూచించారు. భూ వివాదాలు, హక్కుల నమోదు, రికార్డుల మార్పులు, భూ సంబంధిత దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలించి నిబంధనల మేరకు నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రయోజనం..

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుల ఎంపిక, గృహాల మంజూరు, నిర్మాణాల పురోగతిపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే మంజూరైన గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని, నిర్మాణాలు ప్రారంభం కాని, మధ్యలో నిలిచిపోయిన ఇళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పేదలు, అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల ద్వారా భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలని, లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని ఆదేశించారు. రెవెన్యూ, గృహ నిర్మాణ, అటవీ, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖలు అవసరమైన చోట సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అంతకుముందు నిర్మల్ జిల్లాలోని బాసరలో గోదావరి పుష్కరాలకు సంబంధించి రహదారి అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు లోకేశ్వరం మండల కేంద్రం, దస్తురాబాద్ మండలం గొడిసెరాల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, సీసీఎల్ఏ లోకేశ్ కుమార్, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి విపి.గౌతమ్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా, కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టర్ కె.హరిత, ఉట్నూర్ ఐటీడీఏ పీఓ మంద మకరంద్, మంచిర్యాల అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, పవార్ రామారావు పటేల్, అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## చూపులతో గుచ్చి గుచ్చి..



**ముంబై, అక్టోబర్ 5 (ఉద్యమ కెరటం):** గ్లామర్ ఫొటోషూట్లతో తరచూ అభిమానుల దృష్టిని ఆకర్షించే నటి ఆయేషా ఖాన్ మరోసారి హాట్ టాపిక్‌గా మారారు. తాజాగా ఆమె షేర్ చేసిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. బ్లాక్ స్వూప్ నెక్ క్యామిసోల్‌లో కనిపించిన ఆయేషా.. పెయింట్ బ్రష్‌ను నోట పట్టుకుని ఇచ్చిన ఇంటెన్స్ పోజు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మెస్సీ బన్, ముక్కుపుడకతో సింపుల్ లుక్‌ను ఎంచుకున్న ఆమె.. గోల్డెన్ లైటింగ్ మధ్య జుట్టుతో ఆడుకుంటూ కెమెరాకు పోజిచ్చారు. సహజమైన మేకప్, స్టూడియో వాతావరణం ఫొటోలకు గ్లామర్‌తో పాటు కళాత్మకమైన టచ్‌ను తీసుకొచ్చాయి. మరో ఫొటోలో ఆయేషా పూర్తి భిన్నమైన మూడ్‌లో కనిపించారు. గ్రే ప్యాంట్ ధరించి నేలపై కూర్చుని ఫొటో బుక్‌ను తిరగేస్తూ బ్లాక్ అండ్ వైట్ ఫ్రేమ్‌లో పోజిచ్చారు. ఒకవైపు బోల్డ్ లుక్.. మరోవైపు క్యాండిడ్ స్టైల్‌తో సాగిన ఈ ఫొటోషూట్ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం ఆయేషా చేతిలో కొత్త సినిమా ప్రాజెక్టులపై స్పష్టమైన ప్రకటన లేదు. అయినప్పటికీ ఫొటోషూట్లు, సామాజిక మాధ్యమాల్లో తనదైన స్టైల్‌తో అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు.



# తెరపై థ్యాంక్స్ కార్డ్

### ఎమోషనల్ అయిన 'దృశ్యం 3' దర్శకుడి భార్య!

**ముంబై, అక్టోబర్ 5 (ఉద్యమ కెరటం):** సాధారణంగా భర్త తీసిన సినిమాను థియేటర్‌లో చూడటం ఏ భార్యకైనా సంతోషానిచ్చే విషయమే. కానీ, వెండితెరపై భర్త తనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పడం చూస్తే ఆ భావోద్వేగం మాటల్లో వర్ణించలేనిది. సరిగ్గా అలాంటి అనుభూతినే పొంది కన్నీటి పర్యంతమయ్యారు బాలీవుడ్ నటి శివాలికా ఒబెరాయ్. తన భర్త, ప్రముఖ దర్శకుడు అభిషేక్ పాఠక్ తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'దృశ్యం: ది కన్‌క్లూజన్' (దృశ్యం 3) సినిమా చూస్తుండగా ఆమె థియేటర్‌లోనే తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సినిమా పూర్తయ్యాక ఎండ్ టైటిల్స్ పడుతున్న సమయంలో.. దర్శకుడు అభిషేక్ పాఠక్ తన భార్య శివాలికాకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ తెరపై ఓ ప్రత్యేక నోట్ వేశారు. సినిమా నిర్మాణ ప్రయాణంలో, కష్ట సమయాల్లో ఆమె అందించిన నిరంతర మద్దతును అందులో గుర్తుచేసుకున్నారు. బిగ్ స్క్రీన్‌పై ఆ థ్యాంక్స్ కార్డ్‌ను చూసి ఉద్వేగానికి లోనైన శివాలికా, ఆ క్షణాలను వీడియో తీసి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అభిమానులతో పంచుకున్నారు. "తెరపై ఆ నోట్ చూడగానే నా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఈ సినిమా ప్రయాణం మొదలుపెట్టినప్పుడు మనం ఎన్నో త్యాగాలు చేశాం, తీవ్రమైన కష్టాలను ఎదుర్కొన్నాం. రోజుల తరబడి ఒకరికొకరం దూరంగా గడపాల్సి వచ్చింది. కానీ నీ పనితనంపై నాకు మొదటినుంచీ పూర్తి నమ్మకం ఉంది. ఈ రోజు నీ కష్టాన్ని ప్రపంచమంతా మెచ్చుకుంటుంటే ఆ శ్రమ అంతా మర్చిపోయాను. భవిష్యత్తులో మన కూతురు 'ఆరికా' కూడా ఈ సినిమా చూసి నిన్ను చూసి గర్వపడుతుంది. నీలాంటి వ్యక్తికి భార్యనైనందుకు నాకెంతో గర్వంగా ఉంది" అని శివాలికా తన పోస్టులో భావోద్వేగంగా రాసుకొచ్చారు. కాగా, అక్టోబరు 2న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన 'దృశ్యం 3' చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లతో ప్రభంజనం సృష్టిస్తోంది. తొలి మూడు రోజుల్లోనే భారత్‌లో ఏకంగా రూ.175 కోట్లు కొల్లగొట్టి, రూ.200 కోట్ల క్లబ్ దిశగా అత్యంత వేగంగా పయనిస్తోంది. ఈ చిత్రంలో అజయ్ దేవ్‌గన్, శ్రియ, ఇషితా దత్తా, టబు, రజత్ కపూర్, జైదీప్ అహ్లావత్, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రల్లో నటించగా.. అలోక్ జైన్, అజిత్ అంధారే, కుమార్ మంగత్ పాఠక్, అభిషేక్ పాఠక్ సంయుక్తంగా నిర్మించారు.

# 'రామాయణ' సెట్‌లో భారీ అగ్నిప్రమాదం

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్, టాలెంటెడ్ హీరోయిన్ సాయిపల్లవి జంటగా నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక భారీ బడ్జెట్ చిత్రం 'రామాయణ'. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రణ్‌బీర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తుండగా.. కన్నడ స్టార్ యశ్ రావణుడి పాత్రలో కనిపించనున్నారు.ప్రస్తుతం ముంబైలోని గోరేగావ్ ఫిల్మ్ సిటీలో ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ క్రమంలో చిత్రబృందానికి ఊహించని షాక్ తగిలింది. సోమవారం మధ్యాహ్నం 4:02 గంటలకు ఫిల్మ్ సిటీలోని రిలయన్స్ మీడియా వర్క్స్, ప్రైమ్ ఫోకస్ వెనుక భాగంలో అగ్ని ప్రమాదం సంభవించినట్లు ముంబై ఫైర్ విభాగం వెల్లడించింది. ప్రైమ్ ఫోకస్ స్టూడియో వెనుక ఉన్న వంద అడుగుల తాత్కాలిక సెట్‌లోని పీసీఆర్ యూనిట్‌లో ఈ మంటలు చెలరేగాయి. ఎలక్ట్రిక్ వైరింగ్, కేబుల్స్, తలుపులు, చెక్కపలకలు, ఏసీ యూనిట్లు, బాంబులు, ప్లాస్టిక్ సామగ్రి, సౌండ్ సిస్టమ్స్, షూటింగ్ పరికరాలు ఈ అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న ముంబై ఫైర్ సిబ్బంది, పోలీసులు, బీఎంసీ వార్డ్ కంట్రోల్, 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సాయంత్రం 4:55 గంటల కల్లా మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. 'రామాయణ' సెట్టే కాకుండా, పక్కనే ఉన్న స్టూడియోలలో షూటింగ్ జరుపుకుంటున్న ఎంటీవీ 'హస్టిల్ 5', 'పతి పత్నీ ఔర్ పంగా 2' సెట్లు కూడా ఈ ప్రమాదం కారణంగా దెబ్బతిన్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం.. 'పతి పత్నీ ఔర్ పంగా 2' సెట్‌లో మొదలైన మంటలు క్రమంగా 'హస్టిల్ 5' సెట్ వైపు కూడా వ్యాపించినట్లు తెలుస్తోంది. అయితే ఈ రెండు సెట్లకు ఎంత మేర నష్టం వాటిల్లిందనే దానిపై ఇంకా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.





# మూడు బ్రేకప్స్.. ఆసుపత్రి పాలయ్యా

### సుప్రీత సంచలన నిజాలు!

**హైదరాబాద్, అక్టోబర్ 5 (ఉద్యమ కెరటం):** ప్రముఖ నటి సురేఖ వాణి కుమార్తెగా సినీ లోకానికి పరిచయమై, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్న నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ సుప్రీత తన వ్యక్తిగత జీవితంపై సంచలన విషయాలను వెల్లడించారు. ఇటీవల ఓ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె.. తన ప్రేమకథలు, ఎదుర్కొన్న తీవ్ర మానసిక క్షోభ, ఆరోగ్య సమస్యల గురించి భావోద్వేగంగా పంచుకున్నారు. తన జీవితంలో ఇప్పటివరకు మూడు బ్రేకప్స్ జరిగాయని సుప్రీత తెలిపారు. చిన్నతనంలో కలిగిన మొదటి క్రష్‌ను తాను సీరియస్‌గా తీసుకోలేదని, అయితే రెండో రిలేషన్‌షిప్ మాత్రం తన జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిందని పేర్కొన్నారు. దాదాపు రెండున్నరేళ్ల పాటు సాగిన ఆ బంధం తనకు ఎంతో మానసిక వేదనను (ట్రామా) మిగిల్చిందని, ఆ ప్రభావంతో ఇప్పటికీ జన సమూహాల్లోకి వెళ్లినప్పుడు భయాందోళనలు, కంగారు కలుగుతుంటాయని చెప్పారు. ఆ మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు ప్రస్తుతం వైద్యుల సలహాతో మందులు కూడా వాడుతున్నట్లు వెల్లడించారు. ఇక మూడో రిలేషన్‌షిప్‌లో ఎదురైన చేదు అనుభవాలను వివరిస్తూ.. భాగస్వామిలోని తీవ్రమైన అనుమానం, ఈగో తట్టుకోలేకపోయానని సుప్రీత చెప్పారు. షూటింగ్ ప్రాంతాల్లో ఎవరితో మాట్లాడుతున్నావ్? ఎందుకు మాట్లాడుతున్నావ్? అంటూ వేధించేవారని, నియంత్రించే ఈ ధోరణి తన కెరీర్‌పై కూడా ప్రభావం చూపడంతో ఆ బంధం నుంచి బయటకు వచ్చేశానని తెలిపారు. వరుస బ్రేకప్స్ వల్ల తీవ్ర ఒత్తిడికి గురై బరువు గణనీయంగా 52 కిలోలకు తగ్గిపోయానని, ఆరోగ్యం క్షీణించి ఆసుపత్రి పాలవ్వాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ సమస్యలను అధిగమించడానికి మెడిటేషన్, క్రమమైన చికిత్స తీసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: 9030717172, 9391127717